సనాతన సారథి

ఫిబ్రవరి 2015



లీలానాటక సూత్రధారి – మాయామానుష వేషధారి

సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము *58* ఫిబ్రవరి *2015* ప్రచురణ తేదీ
సంచిక *2* జనవరి *23*

1. **తొలి పలుకు**	సంపాదకీయం	2
2. **రామకథారస వాహిని** (ధారావాహికం)	**భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు**	4
3. **దివ్యశక్తికి లింగం ఒక ప్రతీక**	శివరాత్రి సందేశం	8
4. **సనాతన సారథి ప్రాధాన్యత**	దివ్య లేఖ	12
5. **ఆరోగ్య ప్రదాయి శ్రీ సత్యసాయి** (16వ భాగం)	డా॥ కె.వి. కృష్ణకుమారి	14
6. **జీవితమొక తోలుబొమ్మలాట** (8వ భాగం)	చీమలకొండ జయాశాస్త్రి	17
7. **వంటిల్లు - ఆధ్యాత్మికత**	చంద్రమౌళి రమాదేవి	19
8. **ఏకత్వ సాధన**	కొప్పరపు బాలామనోహరరావు	22
9. **తల్లిదండ్రుల్ని మరచినవాణ్ని దేవుడైనా కాపాడలేడు**	డా॥ లావణ్య సరస్వతి	24
10. **జ్ఞాపకాల పందిరి** (39వ భాగం)	ప్రొ॥ కె. అనిల్ కుమార్	25
11. **"నేను అందరి సేవకుడిని"**	ఆదూరి శ్రీనివాసరావు	28
12. **మహా మహిమాన్విత ప్రేమావతారి** (44వ భాగం)	బి.వి. రమణరావు	30
13. **విదేశాల్లోని సాయిసంస్థల కార్యకలాపాలు**	సత్యసాయి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్	34
14. **ప్రశాంతి సమాచారం**	దివి చతుర్వేది	37
15. **భక్తులు కోరవలసింది**	చిన్నకథ	40

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం

ఎడిటర్ : బి.వి. రమణరావు

అసిస్టెంట్ ఎడిటర్ : వి. శ్రీనివాసులు

టెలిఫోన్: 287375 (సనాతన సారథి Extn. 128) STD: **08555** ISD CODE: **0091-8555**

గమనిక: *అడ్రసు కవరుపై గల మీ చందానెంబరు ప్రక్కన చందాగడువు ఎంతవరకు ఉన్నదో సూచించడం జరిగింది. మూడు పువ్వుల గుర్తు (***)ఉన్నట్లయితే మీ చందాను వెంటనే రెన్యువల్ చేయించుకోగలరు.*

E-mail: subscriptions@sssbpt.org, editor@sssbpt.org

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) – 515134 తరపున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

ముద్రాపకుడు, ప్రచురణకర్త : కె.ఎస్. రాజన్

తొలి పలుకు

విశ్వామిత్రుడు యాగం తలపెట్టినది సిద్ధాశ్రమంలో. సర్వసిద్ధుల ఆశ్రమం సిద్ధాశ్రమము. కనుక, ప్రతి ఒక్కరి హృదయం సిద్ధాశ్రమమే. ఈ సిద్ధాశ్రమంలో దైవప్రీత్యర్థం గావించే సమస్త కర్మలూ యజ్ఞ స్వరూపాన్ని ధరిస్తాయి. ఆనాడు తాటకిని అంత మొందించటానికి విశ్వామిత్రుడు శ్రీరాముని సహాయం తీసుకున్నట్లుగా, ప్రతి ఒక్కరూ తమ హృదయంలో ప్రవేశించే రాక్షస గుణముల నిర్మూలనకు ఆత్మారాముని సహాయమర్థించాలి. మనస్సనే యజ్ఞవేదికపై దుర్గుణాలనే జంతువులను బలిచేయాలి. ఇదే అంతర్ యజ్ఞము. దీనికి సరియైన ఆదర్శం రామాయణము, అని ఒకానొక సందర్భంలో భగవాన్ బాబావారు విశ్వామిత్రుని యాగసంరక్షణ అంతరార్థమును వివరించారు. లోక సంరక్షణకు యాగసంరక్షణ రూపంలో బాలరాముడు భద్రమైన పునాది వేయటం ఈ మాసం **'రామకథా రసవాహిని'** (12వ భాగం)లో చదువుతారు.

ఇల్లు కాలుతుంటే బయటికి పరుగెత్తగలవుగాని ఇంద్రియాలే కాలుతుంటే ఎక్కడికి పరుగెత్తగలవు? అని ప్రశ్నించారు భగవాన్. ఒక కుర్రవాడు తల్లికి సాయం చేయాలనే ఉద్దేశంతో వంటింట్లో వస్తువులున్న డబ్బాలమీద చీట్లు అంటించి పేర్లు వ్రాశాడు. పంచదార డబ్బామీద మాత్రం 'కారం' అని వ్రాశాడు. అలా తప్పు పేరెందుకు వ్రాశావని అమ్మ అడుగగా, చీమలు పట్టకుండా ఉండటం కోసం అట్లా వ్రాశానన్నాడు. 'కారం' అని పేరు వ్రాస్తే చీమలు రావు కదా అన్నాడు. కేవలం పైపైన ఉండే వేదాంతాలవల్ల లోపల రగిలే 'అగ్నిజ్వాలలు' దూరం కావంటూ భగవాన్ చెప్పిన చక్కని ఉదాహరణ ఇది. ఏమిటీ అగ్నిజ్వాలలు? వాటిని ఎట్లా చల్లార్చాలి? అసలు వాటి బారిన పడకుండా ఏవిధంగా జాగ్రత్తపడాలి? అన్న ప్రశ్నలకు సమాధానం **శివరాత్రి సందేశం**లో లభిస్తుంది.

1958 ఫిబ్రవరి 16వ తేదీన మహాశివరాత్రినాడు భగవాన్ తమ దివ్యహస్తాలతో 'సనాతన సారథి' తొలి సంచికను ఆవిష్కరించి ఆశీర్వదించారు. హృదయంలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసా బీజాలను నాటుతూ విశ్వమానవాళిని సన్మార్గమువైపు మళ్ళించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్న 'సనాతన సారథి' భగవాన్ దివ్య అనుగ్రహాశీస్సులతో 58వ వసంతంలోకి అడుగుపెడుతున్నది. 1962లో జరిగిన సనాతన సారథి వార్షికోత్సవ సభలో భగవాన్, "సనాతన సారథి నా సంకల్ప ఫలితం. నా ఉత్సాహం, నా ఆనందం సనాతన సారథి వెనుక ఉన్నాయి" అని ప్రకటించారు. పత్రిక ప్రారంభంనుండి 1984 అక్టోబరు వరకు మొత్తం 26 సంవత్సరాలపాటు ప్రతి నెల క్రమం తప్పకుండా తమ రచనలను, ఒక్కొక్క నెల రెండేసి 'వాహినులు' అందజేస్తూ వచ్చారంటే, తమ అవతారోద్యమంలో 'సనాతన సారథి'కి భగవాన్ ఇచ్చిన విశిష్టమైన స్థానమును మనం సులభంగా గ్రహించవచ్చు. మనం పుస్తకాలను చూస్తాము, భగవాన్ మన మస్తకాలను చూస్తారు. హృదయం లేని మాటలకంటే మాటలు లేని హృదయానికే వారు ప్రాధాన్యత నిస్తారు. ఈ సత్యాన్ని సుస్పష్టం చేస్తుంది వారి దివ్యలేఖ, **"సనాతన సారథి ప్రాధాన్యత"**

"న శ్రేయో నియమం వినా" అని భగవాన్ పలుమార్లు తమ దివ్యోపన్యాసాలలో హెచ్చరించటం మనం వింటూ ఉంటాము. ఏవిషయంలోనైనా నియమం లేక శ్రేయస్సు లేదు. ముఖ్యంగా నిద్ర, ఆహారముల విషయంలో 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న సూక్తిని గుర్తు చేస్తూ, భగవాన్ సందేశాల వెలుగులో ఆరోగ్య పరిరక్షణకు, పరమార్థ సాధనకు పాటించవలసిన నియమాలను తెలియజేస్తుంది, **"ఆరోగ్యప్రదాయి శ్రీసత్యసాయి"** (16వ భాగం)

నిత్యం ఎన్నో ప్రాణులు మరణించటం చూస్తూ కూడా మనిషి తాను మాత్రం శాశ్వతంగా ఉండిపోతాననుకోవటం అత్యంత ఆశ్చర్యకరమైన విషయమని మహాభారతంలో ధర్మరాజు యక్షుని ప్రశ్నకు సమాధానంగా చెపుతాడు. మానవుడు లేత వయస్సులోనే ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించవలసిన ఆవశ్యకతను గుర్తుచేస్తూ, "శతవర్షముల

దాక మితము చెప్పిరిగాని నమ్మరాదా మాట నెమ్మనమున" అని హెచ్చరించారు, భగవాన్. "స్టార్ట్ ఎర్లీ, డ్రైవ్ స్లోలీ, రీచ్ సేఫ్‌లీ" (త్వరగా బయల్దేరు, నెమ్మదిగా ప్రయాణించు, సురక్షితంగా గమ్యం చేరు) అన్న భగవాన్ ఉద్బోధను ప్రతిబింబిస్తుంది, **"జీవితమొక తోలుబొమ్మలాట"** (8వ భాగం)

"సద్గ్రంథ పఠనంబు లేకయే పలు శాస్త్రములను నేర్పు.... పతి గృహంబె సతులకు పాఠశాల" అన్నారు భగవాన్. ఈ 'పాఠశాల'లో పాకశాలకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. వంటిల్లు కేవలం ఆహార పదార్థాలను వండటానికే కాదు, ఆధ్యాత్మిక తత్త్వాన్ని వంటపట్టించు కోవటానికికూడా అనువైన ప్రదేశమే అంటున్నారు రచయిత్రి. ఆహార పదార్థాల తయారీకి, ఆధ్యాత్మికత నలవర్చుకోవటానికి ఏమి సంబంధం అనుకుంటున్నారా? అయితే చదవండి, **"వంటిల్లు – ఆధ్యాత్మికత"**

"పశ్యతీతి పశుః" అనగా కేవలం బాహ్యదృష్టిగలవాడు పశుసమానుడన్నారు, భగవాన్. అద్దాలగదిలోకి చొరబడిన కుక్క చుట్టూ కనిపించే తన ప్రతిబింబాలను చూసి, అవి తనపై దాడి చేయటానికి వచ్చిన వేరే కుక్కలని భ్రమించి వాటితో పోరాటానికి ప్రయత్నించి అలసిపోయి అశాంతికి లోనవుతుందట. ఈ లోకంలో తన చుట్టూ కనిపించే జనులంతా తన ప్రతిబింబాలే అని గ్రహించని వ్యక్తి అద్దాల గదిలో ప్రవేశించిన కుక్కలాంటివాడని చమత్కరించారు, భగవాన్. మానవత్వంలో ఉన్న సమత్వము, ఏకత్వము అనుభూతికి రాకుండా అడ్డు తగిలేది మనస్సు. దాన్ని అధిగమించటానికి మనం చేయవలసినది **"ఏకత్వ సాధన"**

ఒకనాడు దర్శనం లైన్లలో ఒక భక్తుడు లేచి స్వామికి ఉత్తరం అందిస్తూ, "స్వామీ, నేనొచ్చి పదిరోజులయింది..." అంటుంటే "కాదు, ఎనిమిది రోజులయింది, క్రిందటి బుధవారం వచ్చేవు, నిన్నటికి వారం, ఈ రోజు ఎనిమిదో రోజు, సరే" అన్నారు. "ఒక్కరోజయినా యింతవరకు స్వామికి నా ఉత్తరం అందించే అదృష్టం కలగలేదు" అని అతనంటుంటే "అవును, ఆ రెండు కొబ్బరిచెట్లమధ్య ఉన్న లైనులోనే కూర్చుంటున్నావు. మరి నీ ఉత్తరం ఎలా అందుకో గలను?" అన్నారు స్వామి. "ఈరోజు నాకు ఫ్రంట్‌లైన్ వచ్చింది. ఇంత దగ్గిరగా స్వామిని చూసే అదృష్టం కలిగింది" అని అతననగా, **"దగ్గరగా ఉన్నవాళ్ళు నన్ను చూస్తారు. దూరంగా ఉన్నవాళ్ళను నేను చూస్తాను"** అన్నారు, స్వామి. 1999నాటి భగవాన్ ఢిల్లీ పర్యటనలో ఇంచుమించు ఇలాంటిదే ఒక అద్భుత సన్నివేశం చోటుచేసుకుంది. నిత్యం వేలాదిమంది వచ్చి స్వామిని దర్శించుకుంటుంటే, తమవద్దకు రాలేకపోతున్న కొందరు భక్తులకు స్వామి స్వయంగా వెళ్ళి దర్శన భాగ్యం ప్రసాదించారట. సాక్షాత్ భగవంతుణ్ని తమవద్దకు రప్పించుకున్న ఆ భాగ్యశాలు రెవరు? **'జ్ఞాపకాల పందిరి'** (39వ భాగం) సాయి భగవానుని భక్త వాత్సల్యానికి అద్దం పడుతుంది.

"జగత్సేవకుడైన సూర్యనారాయణుడు సదా మీ వాకిట ముందు నిలిచియే యుండును. మూసియున్న తలుపులను బ్రద్దలుకొట్టి లోపల ప్రవేశించడు. ఎందుకంటే అతడు సేవకుడు. తలుపు తట్టనైనా తట్టడు. యజమాని తలుపులు తెరిచిన తక్షణమే పూర్ణతేజముతో లోపలికి జొరబడి, అంధకారమును పారద్రోలును. పరమాత్మ స్థితికూడా అట్టిదే. తన సాయం అర్థించినంతనే చాచిన చేతులతో జీవులచెంతనే కనిపించును" అని సెలవిచ్చారు, భగవాన్. శ్రీ సాయి సూర్యనారాయణుడుకూడా సదా లోకసేవా పరాయణులై ఉన్నారు. ఈనాడు భక్తులు భగవంతునికోసం అన్వేషిస్తున్నామంటున్నారుకానీ, భగవంతుడే నిజ భక్తునికై అన్వేషిస్తున్నాడు అన్నారు భగవాన్. అట్లే మనం స్వామిసేవ చేస్తున్నామనుకోవటం సూర్యునికి దివటీ చూపటం లాంటిదే! నిజానికి స్వామే అందరికీ సేవ చేస్తున్నారు. కనుకనే, **"నేను అందరి సేవకుడిని"** అన్నారు.

ప్రార్థనకున్న శక్తి ప్రపంచంలో మరి దేనికీ లేదు. ప్రార్థన చేతనే కదా మార్కండేయుడు మృత్యుంజయుడైనది. కాబట్టి, నుదుటిరాతను కూడా మార్చివేయగల మహత్తర శక్తి ప్రార్థనకున్నది, అన్నారు భగవాన్. హృదయం నుండి పెల్లుబికిన ప్రార్థనలకు స్పందించి ఆ **మహా మహిమాన్విత ప్రేమావతారి** సుదూర తీరాల్లో ఉన్న భక్తులని, ఆర్తులని ఆదుకొన్న అద్భుత వైనం చదువుతుంటే, "పుట్టపర్తిలో ఉన్నా పుడమి అంతా నీదే! ఎట్టి ఎండకైన నీ గొడుగు నీడ మాదే!" అని గీతం స్ఫురణకు వస్తుంది. **- సం॥**



భగవాన్ శ్రీ సత్యసాయీశ్వర విరచిత

రామకథారస వాహిని

(గత సంచిక తరువాయి - 12వ భాగం)

ఒక పెద్ద మదగజమువలె, ఒక పెద్ద కొండ కదిలి వచ్చునటుల వచ్చుచున్న తాటకిని రాముడు చూచి చిరునవ్వుతో "తమ్ముడా, చూచితివా? ఆ వికారాకారము! నిజముగా దీని ఆకారము సామాన్య మానవులు చూచి బ్రతుక గలరా! విశ్వామిత్రుడు చెప్పినటుల దీని ఆకారమే భయంకరముగా నుండ దీని బలము చెప్పనక్కరలేదు. ఇంతకూ ఇది ఆడది. చంపుటకు నా మనసంత ఒప్పుకున్నది. కాళ్ళూచేతులు తెగద్రెంచిన దీని శక్తి నశించును" అని మాటాడుచుండగనే పొడవైన చేతులు చాచుకొని రాముని అప్పళమువలె మ్రింగనెంచి హాహాకారము చేయుచూ రామునిపై పడినది.

ఈ దృశ్యము చూచుచున్న విశ్వామిత్రుడు కన్నులు మూసి 'రామలక్ష్మణుల కెట్టి కీడునూ జరుగకుండుగాక' అని ప్రార్థించెను. తాటకి రాముని చెంతకు పోలేకపోయినది. అతనిని సమీపించగనే తనకేదియో కరెంటు షాకు కొట్టినటుల బాధకలుగుచున్నది. ఒకటి రెండు పర్యాయములు అతనిపైబడి బెదిరిపోయినది. అందువలన కోపముతో భూమిని చిమ్మి దుమ్ము ఎగజిమ్మి ఆ ప్రదేశమంతయూ అంధకార బంధురము అయ్యేటట్లు జేసివేసినది. ఈ దుమారములో రామలక్ష్మణ, విశ్వామిత్రులు క్షణకాలము ఏమీ తెలియకుండా సొమ్మసిల్లిరి. ఇంతలో తాటకి మాయమై వారిమీద రాళ్ళవాన కురిపించడము మొదలుపెట్టెను. ఈ చర్యలు గమనించి రాముడు, "ఇట్టి దుర్మార్గమైన రాక్షసిని ప్రాణములతో వదలి పెట్టుట మంచిదికాదు. ఆడది కదాయని ఎంత జాలి తలచిననూ దీని చేష్టలు మితిమీరుచున్నవి" అని తాటకి సూక్ష్మ రూపమున ఎచ్చటున్నదో తెలిసికొని అటువైపునకు అంబును వదలెను.

అంత తాటకి తిరిగి వికార రూపమును ధరించి రామునిపై దుముకుచూ రాగా, రాముడు దాని రెండు బాహువులూ తెగత్రెంచెను. తన భుజములు తెగిపోవుటచేత, బాధను భరించలేక రొప్పుచు కేకలు పెట్టుచు క్రిందపడిపోయెను. తక్షణమే లక్ష్మణుడు దాని అంగములు విడివిడిగా ఖండించెను. తాటకి కామరూపిణి కనుక అంతకంతకు చచ్చినటుల నటించుచూ, తిరిగి అనేక రూపములతో అటూ ఇటూ కనిపించుచూ, తిరిగి రాళ్ళవర్షము కురిపించుచూ ఈరీతిగా తన ప్రతాపమును ప్రదర్శించెను. ఇంతలో రామలక్ష్మణులు ఏమి చేసిననూ కొంత బాధలకు గురికావలసి వచ్చెను. అంత విశ్వామిత్రుడు గమనించి సమయము తప్పిన ప్రమాదము సంభవించవచ్చునని యోచించి, "రామా! నీవు ఆలసించకు, ఆడదని దయతలచుటకు ఇది సమయము కాదు. అంగములు తీసిన ప్రయోజనంలేదు. ప్రాణములున్న, రాక్షసులు ఎన్ని రూపములైనను దాల్తురు. కాన ప్రాణమునే తీయవలెను,

సిద్ధపడుము" అని హెచ్చరించెను. "సంధ్యాకాలం సమీపించుచున్నది. దీని మాయలు మరింత పెచ్చు పెరుగును. సూర్యాస్తమయమైన తరువాత రాక్షసులతో ఎట్టి వారైననూ పోరాడ వీలుకాదు. ఈ లోపుననే దీనిని సంహరించ వలెను. లెమ్ము! సిద్ధము కమ్ము!" అని విశ్వామిత్రుడు రక్షణ మంత్రములు చెప్పుచూ హెచ్చరించజొచ్చెను.

అపుడు, రాముడుకూడనూ సత్యము విచారించి, శబ్దవేదిత్వ జ్ఞానముతో, తాటకి ఎక్కడ నున్నదో కనిపెట్టి సూటిగా నొక తీవ్రమైన బాణమును విడచెను. ఆ బాణము తాటకిని కట్టిపెట్టి కదలనీయక చేసెను. అంత, ఆ తాటకి పెద్దపెద్ద భయంకరమైన శబ్దము చేయుచూ, నాలుక చాచి రామలక్ష్మణులపై వ్రాల ప్రయత్నించెను. ఇక నిదానము చేయుట మంచిది కాదని గమనించి రాముడు దాని ఎదలో నొక చురుకైన బాణమును విడచెను. అంతటితో తాటకి నేలకూలి ప్రాణము వీడెను. ఆ తాటకి క్రింద పడి ప్రాణమువీడు సమయమున, అటూ ఇటూ పొర్లుతున్న బలమునకు పెద్ద పెద్ద వృక్షములు విరిగి నేలకూలినవి. భూమిపై యొక బావివలె గుంత ఏర్పడెను. చుట్టూ కొన్ని నూర్ల గజములు నేలమట్ట మాయెను. కడపటి శ్వాసను వీడునపుడు చేసిన ధ్వనితో మృగములు బెదిరినవి, కొమ్మలు విరిగినవి. ఇంతటి బలమైన తాటకి నేలకూలగనే, విశ్వామిత్రుడు రాముని దగ్గరకు పిలచి, తలనిమిరి, "నాయనా! భయపడితివా? సర్వలోకరక్షకుడ వగు నీకు భయమనునది కలదా! లోకసంరక్షణలో ఇది ప్రధానమైన పునాది. ఇది భద్రమయిననే నీ కార్యభారమను భవనము భద్రముగా నిలువగలదు. అలసిపోతిరి కాబోలు! సూర్యాస్తమయమైనది. సంధ్యా వందనము చేసి, కొంత శ్రమ తీర్చుకొనుట మంచిది. రండి!" అని నదీతీరమునకు తీసుకొని పోయి, "నాయనలారా! ఈ రాత్రికి ఇచ్చటనే విశ్రమించి, తెల్లవారగనే మనము మన ఆశ్రమమునకు వెళ్ళుదము" అని వారలకు అనేక రకములైన కథలను తెలుపుచూ వారి శక్తులను వర్ణించుచూ రాత్రి కాలము గడిపెను.

తెల్లవారినది. ఆచమనము గావించిరి. ఇంతలో విశ్వామిత్రుల వారు చిరునవ్వుతో, రామలక్ష్మణుల చెంతచేరి మందహాసము చేయుచూ మృదుమధురమైన మాటలతో, "రామా! నీ పరాక్రమమునకు సంతుష్టుడనైతిని. నీ విశ్వరూపము నీవు ఆ తాటకితో పోరాడునపుడు గమనించితిని. నిజముగా నేనెంతయో ధన్యుడను" అని ఇంకనూ ఏమేమో చెప్పుచూ ఆనంద బాష్పములు రాల, తనచెంతనున్న సర్వ అస్త్రములను మంత్ర రూపమున రామచంద్రుని హస్తమున నుంచి, "ఈ అస్త్రములు ధరించు అధికారము నాకు లేదు. అట్టి అధికారముకాని, అస్త్రములుకాని నా చెంతనుండియూ నిరర్థకము కదా! సర్వాస్త్రములు నీ స్వాధీనము చేయుచున్నాన"ని, మంత్రములతో ప్రోక్షించి అర్పితము చేసెను. తదుపరి కొంత తడవయిన పిదప రాములను పిలిచి దండచక్రమును, ధర్మచక్రమును, కాలచక్రమును, అత్యుగ్రము అయిన విష్ణుచక్రమును, ఐంద్రాస్త్రమును, వజ్రాస్త్రమును, శివదేవతాకము అయిన శూలాన్ని, బ్రహ్మశిరాస్త్రాన్ని, ఐక్షికాస్త్రమును, అన్నిటికంటే ఉత్తమమైన బ్రహ్మాస్త్రమును రాముల కందించి, తిరిగి కన్నులు మూసి, "రామా! ఇక ఇవి మాత్రము నాకెందులకు తీసుకొమ్మ"ని మోదకీ, శిఖరీ అనే రెండు బలమైన గదలను అందించెను. ఆగ్నేయాస్త్రము, క్రౌంచాస్త్రము, నారాయణాస్త్రము, వాయువ్యాస్త్రము –

ఇవి ఆశ్రమము వెళ్ళిన తరువాత చూతము" అని చెప్పి, "నాయనా! రామా! ఈ అస్త్రములన్నియూ ఇచ్ఛాధీన రూపములు, మహా బలయుతాలు. ప్రపంచమునగల అన్ని అస్త్రాలకంటెను ఇవి అతిశయమయినవి" అని వాటి మంత్రములను కర్ణరంధ్రములద్వారా అందించెను. ఆ మంత్రదేవతల నందరినీ వశముచేయ అప్పుడే జపమును చేయుమని ఆజ్ఞాపించెను. విశ్వామిత్రుని ఆజ్ఞానుసారము రాముడు జపము ప్రారంభించి ఆయా మంత్రరూపములను స్వాధీనపరచుకొనెను.

ఆయా మంత్రరూపములు స్వరూపములతో కంటి యెదుట నిలచి నమస్కరించి, "రామా! నేడు మొదలు మేము తమ కింకరులమ"ని ప్రమాణము చేసి అంతర్ధానమయిరి. అంత రాముడు సంతసించి విశ్వామిత్రులవారికి నమస్కరించి, "స్వామీ! తమ హృదయము త్యాగమయము. నిజముగా మీరు మూర్తీభవించిన సాక్షాత్ అపర త్యాగ యోగ దైవాకారులుగా తోచుచున్నది. కాకున్న ఇంతటి విలువైన శక్తివంతమైన అస్త్రములను ఇతరుల కందించువారు లోకమున నుందురా! స్వామీ! ఏవిధముగా అస్త్రములు నాకందించి, వాటిని వశము చేసితిరో అటులనే వాటిని ఉపసంహారము గావించుకొను మార్గమునుకూడనూ తెలిపి నన్నానందపరచుడ"ని కోరగా, విశ్వామిత్రుడు ఉల్లాస హృదయుడై, "నాయనా రామా! సత్యకీర్తి, ధృష్టము, రథనము, దృఢలాభము, సునాభము, దశాక్షము, శతోదరము, పద్మనాభము, కృశనము, వైరాగ్యము, యోగంధనము, విధూతము, కరవిరకము, రుతరము, పితృసౌమనము, జృంభకము ఇవి అన్నియూ ఇచ్ఛాధీన రూపములు. వాటికి ఉపసంహార మంత్రములు వినుము" అని కర్ణరంధ్రములద్వారా త్రాపించెను. తిరిగి ఆ మంత్రములను జపము చేయగా ఆయా అధికార స్వరూపములు కట్టెదుట నిలచిరి. వారల నమస్కారము లందుకొని రాముడు వారిని హెచ్చరించి "నాకవసరమైనపుడు పిలుతును రండి" అని ఆజ్ఞాపించి, "మీరు స్వేచ్ఛగా విహరింపవచ్చున"ని పంపివేసెను.

అంత విశ్వామిత్రుడు, "నాయనలారా! ఇక మన ప్రయాణమును సాగింతము" అన వారు నడువ మొదలిడిరి. కొంతదూరము వెళ్ళగనే, ఒక పర్వత ప్రదేశము చేరగలిగిరి. ఆ పరిసరములలో ఒక సుందరోద్యానవనము కనిపించుటే కాక సుగంధము వారలను స్వాగతించినటుల చుట్టుకొనెను. భయంకరారణ్యమును దాటి సుందరమైన ఉద్యానవనములు ప్రవేశించుచున్నాము అని సంతసించి, "స్వామీ! ఇది ఏదో పుణ్యాశ్రమమువలె కనిపించుచున్నది. ఇది ఎవరిదో సెలవిత్తురా?" అని రాముడు ప్రశ్నించగనే, విశ్వామిత్రుడు, "నాయనలారా! మహామహులైన యోగులు, దేవతలు తమతమ సంకల్పమును సిద్ధింపచేసుకొనుటకై ఈ ప్రదేశమున నివసించెడివారు. కాశ్యపుడుకూడనూ ఇక్కడే తపస్సిద్ధిని పొందెను. అందువలన నిది సిద్ధాశ్రమమని ప్రసిద్ధి గాంచినది. ఇపుడు నేను భక్తితాత్పర్యములతో ఈ ఆశ్రమములో నివాసము పెట్టుకొన్నాను. ఈ ఆశ్రమపదానికే రాక్షసులు వచ్చి యజ్ఞాన్ని విఘ్నము చేయుచున్నారు. ఈ చోటుననే వారిని సంహారము చేయవలసియున్నది" అని చెప్పుచూ సిద్ధాశ్రమమున అడుగిడిరి. అంత విశ్వామిత్రుడు రాముని భుజములపై చేయివేసి, "నాయనా! ఈ ఆశ్రమము ఇప్పుడు నాదెట్లయినదో అటులనే నేటినుండి నీదిగా నిలువ గలదు" అని ఆనందబాష్పములతో ఆశ్రమమున ప్రవేశించుచుండగనే సిద్ధాశ్రమవాసులు, అందరూ పరుగిడివచ్చి పాదములు కడిగి రామలక్ష్మణులకు అర్ఘ్యపాద్యములు ఇచ్చి ముందు పూలు చల్లుచూ లోనికి గొంపోయి, కొంత ఫలపానీయముల నిచ్చి విశ్రాంతి తీసుకొనుటకు ప్రత్యేక వసతులు గలిపించి రామలక్ష్మణులను కోరగా, వారు తగినంత విశ్రాంతి తీసుకొని లేచి పాదములను శుద్ధిచేసుకొని, విశ్వామిత్రులవారి దగ్గరకు వచ్చి, చేతులు కట్టినిలచి, "స్వామీ, రేపటినుండియే తమరు యజ్ఞము ప్రారంభించవచ్చును కదా" అని ప్రశ్నించగా, "సర్వ సిద్ధముగానున్న సిద్ధాశ్రమములో సిద్ధము చేయ

వలసినవేమున్నవి! తప్పక తెల్లవారగనే దీక్ష వహింతున"ని తెలిపి అందుకు తగినవన్నింటినీ ఆశ్రమవాసులతో చెప్పి ఏర్పాటు చేయించిరి.

తెల్లవారెను. యాగదీక్షను వహించి విశ్వామిత్రుల వారు సిద్ధమయిరి. రామలక్ష్మణులు స్కంద విశాఖులవలె అంబులు ధరించి వారి దీక్షను వారు తీవ్రమైన సంకల్పముతో పూని నిలిచిరి. యజ్ఞదీక్షను పూనిన విశ్వామిత్రులవారిని పలుకరించుట ఉచితము కాదని ప్రక్కల నున్న మహాఋషులతో రామలక్ష్మణులు, సైగలు చేయుచూ రాక్షసులు ఎపుడు వత్తురు, ఏ దిశనుండి వత్తురని వారలను అడుగుచుండెడివారు.

అక్కడివారు "చెప్పుటకు వీలుకాదు. రాక్షసులకు కాలభేదమేమాత్రము నుండదు. ఏ నిమిషము నందైననూ వచ్చి వ్రాలవచ్చును. వారి రాకను చెప్ప నెవరి తరము!" అని ఒక్కొక్కరొకవిధముగ చెప్పుచుండెడివారు. అట్టి మహాఋషుల పలుకులకు సంతసించి ఎప్పటికప్పుడు సిద్ధముగా నుండు టెంతేనియూ అవసరమని తలంచి తమ్ముని హెచ్చరించి నలుదిశలా దృష్టిని ప్రసరింపచేయుచూ, ఏకాగ్రతతో ఏ చిన్న శబ్దము వినిపించిననూ అది రాక్షస శబ్దమా అన్నట్లు జాగరూకతతో వేచి యుండుటను చూచి చేరిన మునులు ఈ పిల్లల ధైర్యసాహసములకు ఆనందము, ఆశ్చర్యమునూ పొందుతూ ఉండెడివారు.

ఈరీతిగా ఐదు అహోరాత్రములు నిద్రపోక ఆ తపోవనమును, యజ్ఞశాలను కాపాడుచుండిరి. ఆరవ దినము పగలు ప్రారంభమయినది. విశ్వామిత్రులవారు యజ్ఞము యథాప్రకారముగా సమంత్రకముగా సశాస్త్రీయముగా సాగించుచున్నారు. ఋత్విక్కులు వారి వారి పనులలో వారు నిమగ్నులయి దీక్షను సాగించుచున్నారు. ఇంతలో ఆకసము బ్రద్దలయినటుల భయంకర శబ్దమొకటి వినిపించెను. దర్భలూ, పానపాత్రలు, హోమపాత్రలు, సమిధలూ, పూలూ, కుంకుమ, అక్షింతలుసహా ఒక్కతూరి అంటుకొన్నవి. భగభగమని మంటలు లేచినవి. వర్షకాలపు మేఘములవలె అప్పటికప్పుడు మేఘములు ఆకసమున ఆవరించి భయంకరమైన చీకటులు క్రమ్మినవి. ఆ మాయ మబ్బులు అమిత వేగముతో పరువులెత్తుకొని యాగశాల దిశకు వచ్చుచున్నవి. ఆ మేఘములనుండి భయంకరమైన రక్తవర్షము కురియ మొదలుపెట్టెను. ఆ రక్త ప్రవాహము వేదికపై పడబోవు సమయమునకు సరిగా మంటలు మరింత అధికమగుచూ వచ్చెను. రామలక్ష్మణులు అతి జాగ్రత్తగా ఆ రాక్షసుల ఆకారములు ఎక్కడున్నవా అని వెతుకదొడగిరి. రాముడు దివ్యదృష్టితో తిలకించి మారీచ, సుబాహులున్న దిశకు మానసాస్త్రమును వదలెను. అది మారీచుని గుండెలకు తగిలెను. వెంటనే ఆగ్నేయాస్త్రము వదలగనే అది పోయి సుబాహుని గుండెలపై గుచ్చుకొనెను. అంతటితో వదలక ఆ కాయములు ఆ అరణ్యమున కూలిన, యజ్ఞము అశుభమగునని తలంచగా ఆ అస్త్రములు రెండూ మారీచ, సుబాహుల దేహములను నూరు యోజనముల దూరము కొట్టివేసి సముద్రమున పడవేయించెను. వారు విలవిల తిరుగుచూ అనేక చేష్టలు చేయుచూ సముద్రమున పడిరి, కాని చావలేదు. అంత మారీచ, సుబాహుల అనుచరులు, అనేకమంది అటూఇటూ పరుగెత్తసాగిరి. రాక్షసుల నెట్టివారలైనను విడుచుట మంచిది కాదు. నేటి అబలత్వమే రేపటి బలముగా మారును. వీరలనుకూడను విడుచుట మంచిది కాదు అని లక్ష్మణునికి తెలిపి, వారందరినీ సంహరింపజేసెను.

ఈ దృశ్యమును కనులారా చూచుచున్న మహర్షులు, మహదాశ్చర్య చిత్తులై వీరు సాక్షాత్ పరమ శివుని రుద్రభద్రాకారులే అని విశ్వసించి, తమలో తాము వారలకు నమస్కరించిరి. అరణ్యం నిమిషములో ప్రశాంతమైన వాతావరణంతో కళకళలాడదొడగినది. విశ్వామిత్ర మహర్షి చెక్కు చెదరక కట్టుకదలక వేదిక వీడక తన దీక్షలో తాను నిమగ్నుడై పూర్తి చేసెను. పూర్ణాహుతి అత్యంత వైభవముగా మంగళకరముగా సమాప్తి ఆయెను.

(సశేషం)

శివరాత్రి సందేశం:

దివ్యశక్తికి లింగం ఒక ప్రతీక



నేడు శీతాచలం నుండి సేతువుదాకా 'శివోఽహం శివోఽహం' అనే పవిత్ర ధ్వనితో మారుమ్రోగుతున్నది. ఇటువంటి పవిత్ర దినాన నా సన్నిధికి రాగలగటం మీ భాగ్యం. మీ దివ్యత్వమును గుర్తించుకోవటానికి ఇటువంటి పర్వదినములు ఏర్పడినవి. ఈ దినాలలో ఆత్మవిమర్శ చేసుకొని మీ సామర్థ్యమును తెలుసుకొని విడిచిపెట్టవలసిన గుణములేవో, పెంపు చేసుకోవలసిన లక్షణములేవో విచారించుకోవాలి. పరమాత్ముని సన్నిధికి చేర్చగల సద్గుణములనూ, సద్భావాలనూ పెంచుకోవాలి. దేశ కాల బద్ధమైన లౌకిక ప్రపంచానికి మిమ్మల్ని ఆకర్షించే లక్షణములన్నిటినీ వదలిపెట్టాలి. అవి తాత్కాలికమైనవేనని గుర్తించాలి.

మీరు ఆశించే ఆనందమంతా మీలోనే ఉన్నది. ఇనుపపెట్టెలో అమూల్యమైన సంపదలున్నప్పటికీ వాటిని పొందటానికి తాళపుచెవి ఎక్కడ ఉందో తెలియనివారిలాగా మీరు బాధపడుతున్నారు. సరియైన బోధలు విని, వాటిని మననం చేసి, అనుష్ఠించటంవల్ల తాళపుచెవిని కనుక్కొని, ఇనుపపెట్టె తెరిచి లోపలున్న సంపదనంతా అనుభవించగలరు. కోపమూ గర్వమూ ద్వేషమూ అసూయా అనే జ్వాలలు అత్యంత భీకరమైనవి. అవి దొంగచాటుగా మనస్సులో చొరబడి అంతులేకుండా దహించివేస్తుంటాయి. గీతలో అగ్నిని 'అనలము' అన్నారు. అనలమంటే ఎప్పటికీ తృప్తి చెందనిది అని అర్థము. అగ్ని ఎన్నడూ 'ఇక నాకు చాలును' అనదు. దూరాన ఉన్న అగ్నిని చూసి మీరు బెదిరిపోతారు. మీలోపలే రగిలే అగ్ని సంగతి ఏమని చెప్పాలి! ఈ భయంకర జ్వాలలను ఎట్లా చల్లార్చాలి? సనాతన ధర్మము మహర్షులు అనుభవంద్వారా తెలిపిన కొన్ని అగ్ని నిర్మూలక విధానాలను బోధిస్తున్నది. అవే సత్య ధర్మ శాంతి ప్రేమలు. వీటిలో మీ హృదయాలను నానబెట్టినప్పుడు వాటిని అగ్ని దహించలేదు.

నిర్మల చైతన్యం ఒక దీపం. దానిలో అనుగ్రహమనే తైలం పోయాలి. నిగ్రహమనే వత్తిని పెట్టాలి. నామస్మరణమనే లాంతరు గ్లాసును చక్కగా అమర్చాలి. అప్పుడు సుఖ దుఃఖాల గాలి తాకిడివల్ల లోపలి జ్యోతి అంతరించదు. 'అహం బ్రహ్మాస్మి', 'తత్త్వమసి' వంటి మహావాక్యములతో జ్యోతిని వెలిగించాలి. అప్పుడు వెలుగు మీకేగాక ఇతరులకు కూడా ఉపకరిస్తుంది. ఒక జ్యోతి నుంచి ఎన్నో జ్యోతులు వెలుగుతాయి.

శివరాత్రి వంటి పర్వదినాలను మామూలు సెలవు రోజుల్లాగా సినిమాలతో, చీట్లాటలతో, విహార యాత్రలతో వ్యర్థంగా గడపవద్దు. భగవంతుని ధ్యానించటంకోసం, మానవసేవ చేసి దానిద్వారా ఈశ్వరారాధన చేయటంకోసం మహర్షులు ఈ పర్వదినాలను ఏర్పాటుచేశారు. ఈనాడు ఆత్మలింగంగా ఉద్భవించే జ్యోతిర్లింగమును ధ్యానించండి. నాలోనేకాక మీ అందరిలోనూ లింగం ఉన్నదని తెలుసుకోండి. శవమును శివము చేసే దివ్యశక్తికి లింగం ఒక ప్రతీక. ప్రభవించే ఆత్మలింగమును దర్శించి మీ అంతరంగ చేతనను దాని భావనతో నింపుకొని దివ్య శిఖరాలను

అందుకోండి. ప్రశాంతి నిలయమందు మీరు గడప దలచిన దినములను కబుర్లతో, శుష్కవాదములతో వ్యర్థం చేసుకోవద్దు. అర్థం లేని కుతూహలంతో అటూ ఇటూ తిరుగుతూ పాడుచేసుకోవద్దు. ఇక్కడి క్రమశిక్షణను పాటించి సంభాషణలనూ, సహవాసములనూ సౌఖ్యములను పరిమితం చేసుకోండి. దివ్య చింతనతో మీ కాలం గడపండి. ఈ పరిసరాలలో ఉన్నప్పుడు మాత్రమేకాక మీ స్వస్థలాలకు చేరుకున్న తరువాతకూడా ఈ నియమాలను అనుసరించి మీ ఆలోచనలు దైవంవైపు మరల్చుకోవాలి. ఇక్కడి ప్రశాంతిలో ఉన్న ఆనందం అనుభవించండి. మీ మనోవాక్కాయ కర్మలలో దేనిచేత కూడా ఈ ప్రశాంతిని భంగపరచవద్దు. మీ పూర్వ పుణ్యఫలంవల్ల చిక్కిన ఈ సదవకాశమును, ఈ అపూర్వ అవకాశమును చక్కగా వినియోగించుకోండి.

మహేశ్వరుడు తన భక్తుల శ్రేయస్సుకోసం శివరాత్రినాడు లింగాకారం ధరించును. మహేశ్వరుని వద్ద నుండి కోరవలసింది జ్ఞానం. మానవునిలో దాగి ఉన్న దివ్యత్వమును జ్ఞానమే వ్యక్తము చేయగలదు. అన్ని యాగములకూ తపస్సులకూ అదే పరమ లక్ష్యం. ఐహిక సుఖముల వెంట పరుగు తీయటంవల్ల అటువంటి ఆనందం, అందులో ఒక లేశం కూడా లభించదు. నిద్రలో త్రాచుపాము కరిచినట్లు కల వస్తే దానికి విరుగుడు మెలకువే. మెలకువవల్ల కలిగే ఎఱుకయే జ్ఞానం. సర్వశక్తిమంతుడైన భగవంతుని విభవమునూ సామర్థ్యమునూ ధ్యానించటంవల్లనే ఆ జ్ఞానమును పొందగలరు.

మనిషి సుఖంగా బతకటానికి ధాన్యమూ ధ్యానమూ రెండూ ముఖ్యావసరాలు. శరీర పోషణకు ధాన్యమూ, దైవమందిర ప్రవేశం చేసి ఐక్యం పొందటానికి ధ్యానమూ అవసరం. మహర్షులు ఏకాంత వనాంతరములలో కఠోరమైన దీక్షతో ధ్యానం చేసి మానవుల శ్రేయస్సుకోసం అమూల్య ఆధ్యాత్మిక సంపదలు సమకూర్చినారు. ఇటువంటి మహనీయు లందరూ నర సమూహాలనుండి పారిపోయిన పిరికిపందలని విమర్శించేవారున్నారు. జటిలమైన జీవిత సమస్యలను వారు ధైర్యంగా ఎదుర్కొనలేక పోయారంటారు. ఇతరులగురించి ఆలోచించకుండా స్వీయ మోక్షాపేక్షతో స్వార్థపరులుగా వర్తించారని అటువంటివారిని నిరసిస్తున్నారు. మానవకోటికి తరణోపాయం అందించటంకోసమే ఆ మహర్షులు నిర్జన ప్రదేశాలకు వెళ్ళారు.

ఉన్నత విద్యలకోసం యువకులు పలువురు ఈనాడు విదేశాలకు వెళుతున్నారు కదా! వాళ్ళని పిరికిపందలుగా, సమాజానికి పనికిరానివారిగా తలపోయటం సబబు కాదు. ఇంకా గాఢమైన పరిజ్ఞానమూ విశేషమైన అనుభవమూ విదేశాలలో గడించి తిరిగి వచ్చి మాతృదేశానికి ఎక్కువగా ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే పరదేశాలకు వెళుతున్నారు.

అదేవిధంగా, మహనీయులు లోకానికి ఎక్కువగా ఉపయోగపడటంకోసమే లోకానికి దూరంగా వెళ్ళేవారు. మురిపించి దారితప్పించే ఇంద్రియ సుఖాలకు, ఆధ్యాత్మిక ఆనందమునకు భంగం కలిగించే భవరోగాలకు వారు దూరంగా వెళ్ళేవారు. ఆశ్రమములలో, తపోవనములలో, అరణ్యములలో వారు నేర్చిన ఆత్మవిద్య వారి చెంతకు చేరిన వారికందరికీ మోక్షప్రాప్తి ప్రసాదించగలిగినది. వారు సాధించిన ప్రశాంతీ ఆనందమూ ఇతరులకు ఉద్దీపనం ఇచ్చేవి. లోకానికి దూరంగా వెళ్ళినవారిని తప్పు పట్టినవారు లోకంలో ఉండి సాధించిన ఘనకార్యమేమున్నది! ఒక్క కుటుంబానికి చెందిన మనుషులే ఒకరిపట్ల మరొకరు తేళ్ళమాదిరిగా, పాములమాదిరిగా ప్రవర్తిస్తున్నారు. సుఖశాంతులకు

2

నిలయములుగా అలరారవలసిన సంసారాలెన్నో జంతువుల శాలలుగా ఉంటున్నాయి.

నేను కోపమూ ద్వేషమూ అసూయా గర్వమూ మిమ్మల్ని దహించే అగ్నిజ్వాలలు అన్నాను కదా. అయితే, ఇటువంటి గుణాలవల్ల ఒక్కొక్కప్పుడు కొంత ఉపయోగం కలుగవచ్చు. త్రాచుపాము బుసకొట్టి శత్రువులను బెదిరించి దూరాన నిలుపుతుంది. సాధకుని బాటలో ఆటంకం కలిగించేవాటిపైన కోపం, జంతుప్రాయంగా మనిషిని మార్చే అలవాట్లమీద ద్వేషం ఉండవచ్చు. అందరిలోనూ అన్ని కార్యకలాపాలలోనూ పరమేశ్వరుని సందర్శించగల జ్ఞానం అలవరచుకోవాలి. అప్పుడు జన్మ చరితార్థం కాగలదు. ఇతరుల తప్పులు ఎంచవద్దు. నీలో ఉన్న పరమాత్మ వారిలోనూ ఉన్నాడు. నీ దోషములే నీకు ఇతరులలో కనిపించేవి.

ఈ లోకంలో ఉన్నవి రెండే – క్షేత్రమైన దేహమూ క్షేత్రజ్ఞుడైన దేహి. లోకమే లోకేశ్వర స్వరూపము. మీరు కళ్ళు తెరచి ఉన్నప్పుడు జ్ఞానవంతులమనుకుంటారు. కానీ, అప్పుడు మీరు భిన్నత్వమునే చూస్తూ ఉన్నారు. వీటిమాటున ఉన్న ఏకత్వమును గ్రహించలేక పోతున్నారు. గాఢనిద్రలో మునిగి ఉన్నప్పుడు మీకు ఈ ప్రపంచమూ, దాని భిన్నస్వరూపములూ కనబడవు. మేలుకొని ఉన్నప్పుడే సుషుప్తి స్వప్నావస్థలలో ఏమి జరుగుతున్నదో పరిశీలించండి. అప్పుడు ఈ జాగ్రదవస్థకూడా సత్యసాధనకు ఆటంకం కలిగిస్తున్న దని మీరు తెలుసుకోగలరు. ఇంద్రియాలు మోసం చేస్తాయి. ఇవి చాలా అసమర్థములైన పరికరములు.

బిచ్చగాడు మీ వాకిట్లో నిలబడి 'నేను అనాథను' అనటానికి బదులుగా మొరటు మాటలలో 'నేను అనాదివాడిని తల్లీ' అనటం మీరు వినే ఉంటారు. తనకు దిక్కులేదని చెప్పబోతూ తనకు మొదలు లేదు అంటాడు. తనకే కాదు, మీకందరికీ మొదలు లేదనే



పరమ రహస్యం అతను వెల్లడిస్తున్నాడు. అదే సత్యం. 'భిక్షాం దేహి' అంటాడు. దేహిని భిక్షం అడగటంలో ఉన్న అంతరార్థం గ్రహించండి. ఈ దేహము దేహికి తాత్కాలిక నివాసము అన్న సత్యమును భిక్షుకుడు జ్ఞాపకం చేస్తున్నాడు.

రాణి రాసమణి ఒకసారి దక్షిణేశ్వరాలయంలో సత్సంగంలో పాల్గొంటున్న సమయాన రామకృష్ణ పరమహంస ఆమె చెంపమీద కొట్టగా అందరూ విస్తుపోయారు. ఆమె సత్సంగంలో బోధిస్తున్న విషయాలపై దృష్టిపెట్టకుండా ఏవో కోర్టు వ్యవహారాల గురించి ఆలోచిస్తున్నదని ఆయన గ్రహించారు. విముక్తి పొందటానికి అవకాశాలు చిక్కినప్పుడు వ్యర్థం చేసుకోవద్దు. అంతకంటే అవివేకంలేదు.

మీ స్వస్థానాలకు తరలి వెళ్ళినప్పుడు మీరు "పుట్టపర్తిలో భారతదేశపు మూలమూలలనుంచి వచ్చిన

వేలాదిమందిని చూశాము. విదేశాలనుంచి కూడా చాలామంది వచ్చారు. బాబా దర్శనంకోసం చాలా రద్దీ ఏర్పడింది" అని కబుర్లు చెపుతారు. ఒకావిడ రోజూ పురాణ శ్రవణానికి వెళ్ళేది. అక్కడికి వచ్చిన జనమూ, లైట్లూ, దూర శ్రవణ యంత్రాలనూ వర్ణించింది. కానీ, పురాణ కథ ఎవరిని గురించినదో తనకు తెలియదు అన్నది. ఆ చందంగా ఉండకూడదు. ఇక్కడి ప్రశాంతీ నామస్మరణమూ భజనా జపమూ ధ్యానమూ ఏకాగ్ర చిత్తముతో దైవచింతనమూ ఆధ్యాత్మిక దృష్టి ఉన్న భక్తులతో సత్సంగమూ ప్రధానమైనవి. దుఃఖాలు మిమ్మల్ని ముట్టడించినప్పుడు అవే ఆదుకోగలవు. ఒక ఇంటి యజమానికి అవసాన దశ వచ్చింది. భార్యా బిడ్డలు చుట్టూ చేరి ఏడుస్తూ, "మమ్మల్ని విడిచి వెళుతున్నావా? ఇంక మా గతి ఏమిటి?" అన్నారు. చనిపోతున్న మనిషి వాళ్ళవైపు తిరిగి ఎంతో వేదనతో, "మిమ్మల్ని విడిచి వెళ్ళిన తరువాత నా గతి ఏమిటి?" అని ప్రాణం విడిచాడు. సంశయాలతో, నిర్వేదంతో చరమ దశకు చేరవద్దు. శరీరం మరణించినా ఆత్మ నశించదు. మీ నిజతత్త్వానికి మరణం లేదు.

ఎన్నో వేలమంది ప్రశాంతి నిలయం వచ్చి అపూర్వమైన ఈ సత్సంగంలో పాల్గొన్నారు. లోగడ రానివారు చాలామంది ఇప్పుడిక్కడ ఉన్నారు. ఈ మహాభాగ్యం అనుభవిస్తున్నారు. ఇది కాకతాళీయంగా జరిగినది కాదు. ఈ మహాభాగ్యం సాధనవలనగాని, అనుగ్రహమువలనగాని ప్రాప్తించగలదు. ఆత్మ లింగోద్భవమును దర్శించటానికి అనుగుణమైన ప్రశాంత ప్రార్థనా పూరిత మానసిక స్థితిని కల్పించుకొని నిరీక్షణ చేయండి.

(1965 మహాశివరాత్రి దివ్యబోధనుండి)

SRI SATHYA SAI GENERAL HOSPITAL

Prasanthi Nilayam – 515134 Puttaparthy, Anantapur Dist, A.P

mail: hrmgh@sssihms.org.in , Phone 08555-287256, Fax 08555-289409

Applications are invited for the following posts:

Senior Resident/ Junior Consultant in the Departments of

1. Obstetrics & Gynecology. 2. General Surgery 3. E.N.T

Qualification : M.B.B.S + MD/ D.G.O
M.B.B.S + MS (General Surgery)
M.B.B.S + MS (Otolaryngology)

Scale of Pay :
Senior Resident (with PG Degree): Pay band 15600-39100, Grade Pay 6600 – Gross Pay Rs 48165/-
Junior Consultant : Pay band 15600 -39100, Grade pay 7600. Gross Pay Rs 71915/-

4. Junior Residents/ Medical Officers for the Department of Obstetrics & Gynaecology on Consolidated Pay / Regular scale - Qualification : M.B.B.S
Apply to the Medical Superintendent, Sri Sathya Sai General Hospital, Prasanthi Nilayam, with full Bio-data and a photograph.

Medical Superintendent

సనాతన సారథి ప్రాధాన్యత

[“సనాతన సారథి నాకు, మీకు మధ్య వారధిలాంటిది” అని ఉద్ఘాటించారు భగవాన్. వారి దివ్య అవతారోద్యమంలో సనాతన సారథికి గల ప్రాధాన్యతను, పాండిత్యమునకుకాక హృదయ భావమునకు వారిచ్చే ప్రాముఖ్యతను విశదపరుస్తూ వారి దివ్యహస్తములతో వ్రాసిన లేఖను ఈ క్రింద ప్రచురిస్తున్నాము]



రామశర్మా! అందుకో నాయనా! ఆశీర్వాదములు.

నేను మద్రాసునుంచీ 29 వస్తిని పర్తీ. అక్కడున్నంత కాలమూ వక నిమిషము విరామములేక నీకు జాబు వ్రాయలేదు. తిరుమలాచార్యులకు మాత్రము వక సానుభూతి సర్వధైర్యములతో చేరిన పత్రము వ్రాస్తిని. మీకు తెలిపియే యుండును. నేను హైదరాబాద్ ట్రిప్పు ఆనందముగా చేసుకొని వస్తిని. ఇక్కడ 9వ తేదీ క్రిష్ణరాజ పురమువారిది వక వృపనయనము వృన్నది. తదుపరి 16 మహాశివరాత్రి. దానికి తగిన యేర్పాట్లు జరుగుచున్నవి. మన పత్రిక సనాతన సారథి ప్రారంభించుటకు ప్రభుత్వము నుంచీ అనుమతి చిక్కినది. ఫిబ్రవరి 16 నుంచీ ప్రారంభమగుచున్నది. అనగా ఆనాడు అందరికీ పంపబడును. నీవ్వు శివరాత్రికి వస్తున్నావా? తప్పక రా. ప్రయత్నించి అట్టి అవకాశమును కలిగించుకో. అదే ముఖ్యమయినది బంగారూ! నీవ్వుకూడా సనాతన సారథికి ఉత్తమ విషయములూ, భక్తి భావములూ, స్వామి లీలలూ నీకు తోచినవి వ్రాయి. పాండిత్యమూ పేరు పెద్దవారూ మనకు అక్కరలేదు. హృదయభావమున్నవారే, అనుభవ సారమును ఆరగించువారే మనకు ప్రధానము. కాన మీబోటి అనుభవ వాక్కులే ఆనందాన్ని అందిస్తాయి. కా నదే ప్రధానము. తప్పక పంపు. తిరుమలాచారితో కూడా తెలుపు బంగారూ! ఇంకా కుప్పావధానులకూ కూడా తెలుపు. అక్కలకు, మీ యిల్లాలుకూ పిల్లలకూ ఆశీర్వాదములు.

బాబా

Bhagavan

SRI SATHYA SAIBABA,

PRASHANTHI NILAYAM,

PUTTAPARTHI

(Via) Penukonda ✫ *Andhra State.*

[illegible]

ఆరోగ్యప్రదాయి శ్రీ సత్యసాయి

(16వ భాగం)

డా॥ కె.వి. కృష్ణకుమారి

ప్రతి జీవికీ ప్రశాంతి అవసరం. శాంతియుత జీవనము అత్యవసరము. ఆరోగ్య పరిరక్షణ అంతే అవసరము. ఇవన్నీ ధ్యానయోగం వల్లనే లభిస్తాయి. ఈ యోగమును పొందాలంటే, మనస్సును స్వాధీన పరచుకోవాలి. ఆత్మధ్యానమును అభ్యసించాలి. అందుకు ఆహార నియమములను పాటించితీరాలి. యోగసాధనకూ, ఆధ్యాత్మిక ప్రగతికీ, ఆత్మసాక్షాత్కార సిద్ధికీ ఆహార నియమాదులు ప్రతి వ్యక్తికీ ఎంత అవసరమో, ఎంతవరకూ అవసరమో గీతలో కృష్ణ పరమాత్మ ప్రబోధించారు. సాయిగీతగా, సాయికృష్ణుడు నిరంతరమూ బోధనలూ చేస్తూనే ఉన్నారు.

'నాత్యశ్నతస్తు యోగోస్తి న చైకాన్త మనశ్నతః
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున"

గీతాచార్యులు అర్జుననిపరంగా సర్వులనూ ఉద్దేశించి, "మానవుని భగవంతునివద్దకు చేర్చు ఏ మార్గమైనా యోగమనే పిలువబడుతుంది. అయితే, అధికముగా భుజించేవారికి, బొత్తిగా భుజించనివారికి, అదేవిధముగా అధికముగా నిద్రించేవారికి, బొత్తిగా నిద్రించనివారికి ఆరోగ్యముతోపాటుగా అన్ని యోగాలూ దూరమైపోతాయి. ధ్యానమును అలవరచుకోలేని వ్యక్తి జీవిత ధ్యేయమునకు దూరమైపోతాడు. మానసికంగానూ, శారీరకంగానూ రోగగ్రస్తుడవుతాడు. ఆహారమనునది పరమార్థ సాధనలో గొప్ప విషయము కాదని చాలామంది ఉపేక్షిస్తారు. కాదు, కాదు. ఈ విషయమునకే అమిత ప్రాధాన్యత నివ్వాలన్న ఆనాటి శ్రీకృష్ణుని ఉవాచే ఈనాటి సాయికృష్ణుని ఉవాచగా మన హృదయాలను స్పందింపజేస్తుంది. స్పందన ఒక్కటే సరిపోదు. ఆ దివ్యవాక్కులు మనలో నిక్షిప్తం కాగలగాలి. మనలను ఉత్తేజితులను చేయగలగాలి. అంతటి అర్హతను మనము సంపాదించుకోగలగాలి.

అమూల్యమైన ఈ మానవ జీవితమును ఆహార నిద్రాదులయందే వ్యర్థము చేయటము ఉచితము కాదు. ఆహారమూ, నిద్రా ఉండవలసినవే. ఐతే ఎంతవరకు? జీవిత నిర్వహణమునకు, పరమాత్మ చింతనకు అవి ఎంత అవసరమో అంత ఉండిన చాలు. అంతకు ఎక్కువగానీ, తక్కువగానీ ఉండిన భగవచ్చింతన జరగదు. భోజనము ఎక్కువైతే శరీరము బరువై, మత్తు కలిగి, ధ్యానమునకు కూర్చొనటానికి వీలుపడదు. ఒకవేళ బలవంతంగా కూర్చున్నా నిద్ర ఆవహిస్తుంది. లేదా కడుపు బరువై దేహబాధ కలుగుతుంది. అప్పుడు ఆత్మవైపుగా వెళ్ళవలసినవారు దేహము దగ్గరే నిష్ప్రయోజకులై ఉండిపోవటము జరుగుతుంది. అధికాహారము, ధ్యానమునకూ, ఆరోగ్యమునకూ ఆటంకమై నిలుస్తుంది. అందుకే మితాహారమే అన్నివిధాలుగా శ్రేయస్కరము.

"ద్వౌభాగే పురయేదన్నైః తోయేనైతం ప్రపూరయేత్
మారుతస్య ప్రచారార్థ చతుర్థమవశేషయేత్"

"కడుపులోని సగ భాగమును అన్నాదులచేతను, పాతిక భాగమును నీటిచేతను నింపి, తక్కిన పాతిక భాగమును గాలి ఆడుటకై ఖాళీగా ఉంచవలెను" అన్న గీతాచార్యుని వ్యాఖ్యలను, తిరిగి మనకోసం వ్యాఖ్యానిస్తూనే ఉంటారు స్వామి. యోగ ధ్యానాలు శారీరక ఆరోగ్యానికీ, తద్వారా మానసిక చైతన్యానికీ, ఆధ్యాత్మిక పురోగతికీ సోపానాలు కనుక, తమకు చెందిన దివ్యాంశలమైన మనలో చైతన్య దీప్తులను వెలిగించాలనీ, అద్వైత స్థితిని సిద్ధింపజేయాలనీ స్వామి అనుక్షణం ఆకాంక్షిస్తూనే ఉంటారు. ధ్యాన సముపార్జనకోసం ఆహారపరమైన జాగ్రత్తలను సందర్భోచితంగా మనకు విశదీకరిస్తూనే ఉంటారు.



ఆహారము ఏమీ భుజించనివారికి ధ్యానము సాధ్యము కాదు. ఎందుకనగా, శరీరమూ మనస్సూ ఏర్పడేదే ఆహారమువలన కనుక. సరైన ఆహారము తీసుకొనకపోవటమువలన శరీరము క్షీణించిపోతుంది. సరిగ్గా కూర్చొనుటకు శరీరమునకూ, ధ్యానించుటకు మనసుకుగానీ శక్తి ఏమాత్రమూ ఉండదు. కనుక, శుష్కోపవాసములు తరచుగా చెయ్యటము మంచి పద్ధతి కాదు. శరీర ఆరోగ్యముకొరకు పక్షమునకు ఒకసారిగానీ, ఏకాదశి మున్నగు తిథులయందుగానీ ఉపవాసము చెయ్యవచ్చును. అధికాహారము, నిరాహారముల జోలికి వెళ్ళకుండా మితాహారిగా ఉండటము శ్రేయస్కరము. అంతేకాదు. నిద్ర విషయంలోకూడా ఎంతో జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. అధిక నిద్రను, నిద్రలేమిని రెంటినీ వదలి, మితనిద్రను కలిగియుండాలి. శరీర నిర్మాణము ననుసరించి ఉపాధికోసము ప్రతి దినమూ విశ్రాంతి ఎంతైనా అవసరము. విశ్రాంతి లేకున్నా, మితము తప్పినా రెండునూ ప్రమాద హేతువులే. అందుకే సాధకుడు ఆహార నిద్రలను సమముగా సమతత్త్వముతో పాటించవలసి ఉంటుంది, అన్నది శ్రీ సాయి కృష్ణుల ఉవాచ.

కర్మలయందును, నిద్రా జాగరణలయందును, ముఖ్యముగా ఆహార విహారాదులయందును మితముగా వ్యవహరించువారికి ఆత్మానందము, తద్ద్వారా బ్రహ్మానందము సిద్ధించి తీరుతుంది. ఏ విషయములోనైనా మితము తప్పి ఆచరించే యోగము యోగమనబడదు. అది జీవుని దుఃఖమును పోగొట్టలేదు. దుఃఖ హేతువు సాధన పద్ధతిలో లోపమేగానీ యోగముయొక్క పొరపాటు ఎంతమాత్రమూ కాదు. మంచి ఔషధమును పద్ధతి ప్రకారము తీసుకుంటేనే కదా ఫలితముంటుంది, అంటారు సాయికృష్ణులు. యోగాచరణ సర్వరోగ నివారిణి. యోగము పరమార్థ సాధనకోసం మొదలుపెట్టి, లేనిపోని ఆవేశముతో రాత్రింబవళ్ళు మితిమీరి, శక్తికి మించి కృషిచేసి, శారీరకంగా మానసికంగా అస్వస్థులై, ఆ లోపమును యోగముపైన ఆరోపిస్తూ ఉంటారు చాలామంది. అది అవగాహనలోపంతో, అమాయకత్వంతో చేజిక్కించుకున్న స్వయంకృతాపరాధ ఫలితం.

యోగమంటే అర్థం కాని, అర్థం చేసుకోలేని అమాయకులకు సహితం ఆహారం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సులభమైన భాషలో విసుగూ విరామం లేకుండా చెపుతూనే ఉంటారు స్వామి, కొందరైనా అర్థం చేసుకొని ఆచరించకపోతారా అన్న ఆశయంతో.

> “ఆహారమును ఇష్టమొచ్చినట్లుగా తినకూడదు. సమయం కాని సమయంలో తీసుకోకూడదు. వయసును బట్టి, శక్తి సామర్థ్యములను బట్టి, చేసే పనులను బట్టి, ఆహారాన్ని హద్దులో పెట్టుకోవాలి. ఏ పనీ చేయనివాడు అదే పనిగా తింటూ కూర్చుంటే వాని జీవితము వృథా అయిపోతుంది. కాయ కష్టము చేసి ఎండలో తిరిగేవాడు భుజించే ఆహారమువలన వానికి ఆరోగ్యమేకానీ అనారోగ్యము కలుగదు. సుఖంగా కూర్చుని ఇంకా జీర్ణం కాకపూర్వమే మరొక

పదార్థాన్ని తింటూ కూర్చునేవాళ్ళకే అనేక రోగములు సంప్రాప్తమవుతుంటాయి. మీరు చూస్తూనే ఉంటారు. చాలామంది బిచ్చగాళ్ళు చంటిబిడ్డలను మూపుకు కట్టుకుని బిచ్చమెత్తుతూంటారు. ఏ ఇంట్లో ఎటువంటి ఆహారము వాళ్ళకు చిక్కినా మహాప్రసాదంలా తిని పిల్లలకు పాలిచ్చి పోషణ చేస్తూంటారు. ఆ పిల్లలు చక్కగా ఉక్కుగుండువలె గట్టిగా ఉంటారు. చిక్కినవన్నీ తింటూ ఆడుకుంటూ పోతూ ఉంటారు. ఇక మనవారు గర్భం ధరించిన సమయం నుంచీ అతి సుకుమారంగా, అతి జాగ్రత్తలు తీసుకుంటూ 9వ మాసం రాకముందు నుంచే హాస్పిటల్లో, నర్సింగ్ హోమ్‌లో చేరే ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అక్కడ టానిక్స్, మందులు, ఇంజెక్షన్లు అనేకం తీసుకుంటూ ఆరోగ్యాన్ని పుంజుకున్నామనే అనుకుంటారు. అయినా కూడా ప్రసవం తరువాత ఇంటికి వచ్చాక బలహీనంగా ఉన్నామంటూ వాపోతారు. ఏమిటీ వీక్‌నెస్ (బలహీనత)? వీరిది సోమరితనమే కాని, బలహీనత కాదు. వారు శరీరానికి తగినంత పనిచేస్తూ ఉంటే ఈ వీక్‌నెస్ రావటానికి అవకాశమే లేదు. ఏ రోగములైనా సుఖము మరిగినవారికే అధికంగా వస్తూంటాయి గాని కష్ట జీవులకు రావు. మనం సుఖాన్ని అధికంగా ఆశిస్తున్నాము కనుకనే, రోగములు కూడా అధికమైపోతున్నాయి."

స్వామి దివ్యోపదేశములను మనము వింటూనే ఉంటాము. భక్తి శ్రద్ధలతో తలలు పంకిస్తూనే ఉంటాము. కానీ, మెదడులోని ఆలోచనలు మటుకు అనేకానేకచోట్ల పరిభ్రమిస్తూనే ఉంటాయి. ఆరోగ్య సముపార్జనను అనేక కోణాలలో ఆవిష్కృతం చేస్తూ ఉంటారు స్వామి.

"మనం ధరించే వస్త్రములు, తినే ఆహారమూ, కట్టుకుంటున్న ఇళ్ళవలన కూడను కొంతవరకూ అనారోగ్యం సంభవిస్తూ ఉంటుంది. గాలి, వెలుతురూ తక్కువ ఉండే ఇళ్ళు కట్టుకోవటం వలన సూర్యరశ్మి మన దేహంపై పడకుండా పోతోంది. అదికూడను అనారోగ్య హేతువే. సూర్య కిరణములు మనలో శక్తి సామర్థ్యములను పెంచుతాయి. రోగ క్రిములను నాశనము చేసి పరిశుద్ధతను పెంచుతాయి. కానీ మనము సూర్యరశ్మి సోకకుండా ఇళ్ళు కట్టుకుంటున్నాము, అనారోగ్యాన్ని ఆహ్వానించుకుంటున్నాము.

"చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత" మనస్సూ, బుద్ధీ అనే సూర్య చంద్రాదులు కొంతవరకూ అంతర్ ఆరోగ్యాన్ని, అంతర్ శుచినీ ఏర్పరచుతూ ఉంటాయి. కానీ బాహ్య సంబంధమైన సూర్య చంద్రాదులు పాంచభౌతికమైన దేహారోగ్యానికి తోడ్పడుతూ ఉంటాయి. ఈ అంతర్బహిర్లక్షణములన్నీకూడను బింబ ప్రతిబింబములేనని గ్రహించాలి."

సర్వదా కోటి తల్లుల ప్రేమామృతాన్ని మనపై వర్షిస్తూనే ఉంటారు స్వామి.

(సశేషం)

ఉపవాసము

చాలామంది స్త్రీలు ఉపవాసములు పూని, ఆరోగ్యమును పాడుచేసుకుంటున్నారు. విషయ వాసనలను తగ్గించక ఉపవాస వ్రతములనాచరిస్తే ఏమీ లాభం లేదు... ఉపవాసమంటే భోజనం మానమని కాదు; భగవంతునికి సమీపంలో కాలం గడుపుట అని అర్థం. అది చేయక కేవలం ఆహార పానీయాదులను మానితే, దేహానికి శిక్షగాని మనస్సుకు శిక్షణ ఏమాత్రమూ ఉండదు.

- బాబా

కవీనాం కవిః (14)

జీవితమొక తోలుబొమ్మలాట

(గత సంచిక తరువాయి)

చీమలకొండ జయాశాస్త్రి

నమ్ముకొనకు నిత్యమ్మని దేహము
పుట్టి ముంచునది నట్టేటన్
తుమ్మునంతలో తూలిపోవు నీ
తొమ్మిది తొఱ్ఱల తోలుబొమ్మ
తై తై తై తై తై బొమ్మా
దీని తమాష చూడర మాయ బొమ్మ!

3

సాక్షాత్ సృష్టి కర్తయైన భగవాన్ బాబావారు దేహము యొక్క తీరుతెన్నులు మనకు అర్థమయ్యే రీతిలో చెప్పడము మన అదృష్టము. స్వామి దేహమును పుట్టితో పోల్చారు. 'పుట్టి' అనేది నదిలో ఈ ఒడ్డునుండి ఆ ఒడ్డుకు దాటడానికి పనికివచ్చే "తోలుతో కప్పిన" తొట్టిలాంటి సాధనమని అందరికి తెలిసినదే! అయితే ఈ పుట్టితో మనకు ఏమి ఉపయోగము? దీనితో మనము ఏ ఒడ్డునుండి ఏ ఒడ్డుకు చేరాలి? ఎవరికి వారు ఏర్పరుచుకునే బంధాలను, బాధ్యతలను సంసార మంటాము. బాధలు ఎక్కువైతే సాగరముతో పోల్చుకుంటాము. ఈ పోలికలవలన మనకు నీటి మధ్యలో ఉన్న భావన కలుగుతుంది. అంటే, మనము ఈదవలసిన భావన కలుగుతుంది. అందుకనే మన దేహమును స్వామి పుట్టితో పోల్చారు. బల్లకట్టు, పడవ, నౌక ఇవన్నీ కఱ్ఱతో చేసినవి. 'పుట్టి' తోలుతో కప్పబడి ఉంటుంది. మన దేహము కూడా తోలుతో కప్పబడి ఉంటుంది కనుక, పుట్టి అనేది దీనికి సరిగ్గా సరిపోయే పోలిక. దేనిని దేనితో పోల్చాలో, సర్వాంతర్యామికి తెలియనిది ఉందా!

దేహము రోజురోజుకి మార్పులు పొందుతుంటుంది. దానినే బాల్యము, కౌమారము, యౌవనము, వృద్ధాప్యము అంటున్నాము. ఈ మార్పులు మనము పుట్టిన దగ్గరనుండి మన దేహములోను, చుట్టుప్రక్కలవారి దేహములలోనూ చూస్తూనే ఉన్నాము. అయినా మనకు ఇప్పట్లో ఏమీకాదు అనే అతిశయముతో కాలమును వృథా చేసుకుంటున్నాము. మనము జన్మించినది మరల మరల జన్మలు పొందకుండా ఉండడానికని స్వామి చెబుతుంటారు. దేహముతో చేసిన కర్మల ఫలితాలు, దేహముతోనే వదిలించుకోవాలి. ఈ దేహమునకు అర్థాంతరంగా రాలిపోయే గుణముంది. దీనికి ఈ

వయస్సు, ఆ వయస్సు అన్నది లేదు. గర్భములో చనిపోవచ్చును, పుట్టిన వెంటనే చనిపోవచ్చును; బాల్య, కౌమార, యౌవనాలలో చనిపోచ్చును; లేదా నూరు సంవత్సరములు దాటినా వృద్ధాప్యముతో ఉండవచ్చును. అందుకనే స్వామి, దైవచింతన వృద్ధాప్యమువరకు వాయిదా వేసేదికాదు, ఈ క్షణములోనే మొదలుపెట్టండి అన్నారు. దీనికి స్వామి ఒక చిన్న కథకూడ చెప్పారు.

ఒకసారి ధర్మరాజువద్దకు ఒక బ్రాహ్మణుడు వచ్చి, తనకు యాగముకొరకు కొంత ధనము ఇమ్మని కోరుతాడు. దానికి, ధర్మరాజు! 'రేపటి దినము రండి, మీకు తప్పక కావలసిన ధనమును యిస్తాను' అని చెబుతాడు. అక్కడే ఉన్న భీమసేనుడు వెంటనే సేవకులను పిల్చి, రాజ్యమంతా పచ్చతోరణములు కట్టి, పండుగ సంబరాలు నిర్వహించమంటాడు. ఇది విన్న ధర్మరాజు, 'ఏమి విశేషము?' అని అడుగుతాడు. దానికి జవాబుగా భీమసేనుడు, "అన్నా! మీకు రేపటి దినమువరకు ఆయుస్సు ఉందన్న నమ్మకముతో ఆ బ్రాహ్మణుడిని రేపటి దినము రమ్మని చెప్పడము విని సంతోషించాను" అన్నాడు. భీముడి ఆంతర్యము గ్రహించిన ధర్మరాజు సిగ్గుపడి, తిరిగి వెళ్ళిపోతున్న ఆ బ్రాహ్మణుడిని పిలిపించి యివ్వవలసిన దానధర్మములు చేస్తాడు.

దీనివలన మనకు తెలిసిన పాఠము – మనము ఈ జనన మరణ చక్రములోనుండి బయటపడాలనుకుంటే వెంటనే ఈ క్షణమే భగవానుని పాదములను ఆశ్రయించాలి. అంతేకాని చదువు అయ్యాక, పెండ్లి అయ్యాక, పిల్లలు పెద్దవారయ్యాక, వారిని ఒకదారికి తెచ్చాక, ఉద్యోగమునుండి రిటైర్ అయ్యాక .... అనుకుంటూ కాలము గడుపుతుంటే, నది మధ్యలో పుట్టి మునిగినట్టు మునిగిపోతాము. ఎక్కడికి ఏ జన్మలోకి కొట్టుకుపోతామో తెలియదు. నరజన్మ మళ్ళీ వస్తుందని నమ్మకములేదు. ఇప్పుడు స్వామి అనుగ్రహించిన ఈ జన్మ వ్యర్థమయితే, మళ్ళీ స్వామి అనుగ్రహము దొరుకుతుందో లేదో తెలియదు. దానికి తోడు ఈ దేహము ఎంత 'గట్టి'దో స్వామి చెపుతూ చమత్కారముగా **'తుమ్మునంతలో తూలిపోవు నీ తొమ్మిది తొఝ్ఖల తోలుబొమ్మ'** అంటున్నారు.

నిజమే! ఎంత వస్తాదుకైనా తుమ్ము వస్తే, తూలుతాడు ఎవరో తోసినట్టుగా! అంత స్థిరత్వములేనిది ఈ దేహమని స్వామి ఎంత బాగా చెబుతున్నారు! పైగా దీనికి తొమ్మిది తొఝ్ఖలు! ఎల్లప్పుడు విషయవాసనల గాలులు వీస్తూండే ఈ సంసారములో తొఝ్ఖలతో ఉన్న తోలుబొమ్మలోనికి విషవాయువుల్లాంటి 'విషయ' వాయువులు ప్రవేశిస్తే ఈ తోలుబొమ్మ విషతుల్యము కాకుండా ఉంటుందా! మన దేహమునే వేణువుగా మార్చుకోవాలి. భగవాన్‌యొక్క అనుగ్రహ గాలి మాత్రమే ప్రవేశించేలా చూసుకోవాలి. అప్పుడే అంతరంగము శుద్ధి అవుతుంది. ఈ తొఝ్ఖలు మామూలు తొఝ్ఖలు కావు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలకు ఆవాసాలు. వీటివలననే మన దేహము నానా అవస్థల పాలవుతోంది. కారణము, ఈ ఇంద్రియాలు మనస్సు అధీనములోనికి వెళ్ళిపోవడమువలన. ఈ తొమ్మిది తొఝ్ఖల తోలుబొమ్మ అంత సామాన్యమైనది ఏమీ కాదు. "అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ....." అన్నట్టుగా దీనిలోపల జ్యోతి స్వరూపములో భగవాన్ ప్రకాశిస్తున్నారు. అయితే, ఆ దివ్యమైన వెలుగు మనకు ఎందుకు కనబడట్లేదు? లాంతరు వెలిగించే ముందు దానిపైన ఉన్న చిమ్నీని(గాజు కుప్పెను) మసి మరకలు లేకుండా మంచి బట్టతో శుభ్రపరచిన తరువాత, వత్తిని వెలిగించి చిమ్నీ దానిపైన పెడితే, ఆ గదంతా చీకటిపోయి ప్రకాశముతో నిండిపోతుంది. అదేవిధముగా, చిమ్నీ లాంటి దేహము ఇంద్రియాల విషయ వాసనలతో, అరిషడ్వర్గముల మసి, మరకలు బారి లోపల ఉన్న దివ్యత్వము కనబడుటలేదు. నిరంతర నామస్మరణ, సత్ప్రవర్తన అనే శుద్ధమైన బట్టతో లోపలివైపు శుభ్రపరిస్తే లోపలనున్న జ్యోతి స్వరూపులైన భగవాన్ శ్రీ సత్యసాయిని మనము చక్కగా చూడవచ్చును. అప్పుడు తొమ్మిది తొఝ్ఖలు స్వచ్ఛముగా ఉంటాయి. మనము ఈ దేహమనే చిమ్నీని బయటవైపునే శుభ్రపరుస్తున్నాము, ఏమి ఉపయోగం! లోపల మందముగా ఉన్న మసి, మరకల్ని పోగొట్టుకోవట్లేదు. అందుకని తూలిపోయే తొమ్మిది తొఝ్ఖల తోలుబొమ్మలా కాకుండా, దివ్యప్రకాశాన్నిచ్చే లాంతరులాగ తయారు కావాలి.

(సశేషం)

వనితాజ్యోతి:

వంటిల్లు - ఆధ్యాత్మికత

చంద్రమౌళి రమాదేవి

అంతటా నిండియున్న ఆ దైవం ప్రతి చోట ప్రతి వస్తువుద్వారా, ప్రతి విషయంద్వారా మనకు ఏదో ఒక సందేశాన్ని అందిస్తూనే ఉన్నాడు. అయితే, ఆ సందేశాన్ని అందుకోవటానికి సునిశిత పరిశీలనా దృష్టి, సూక్ష్మగ్రాహ్య శక్తి మనలో ఉండాలి. 'కాదేదీ కవిత కనర్హం' అన్నట్లుగా, ఆధ్యాత్మికత నేర్పటానికి కాదేదీ అనర్హమైన ప్రదేశం అంటూ వంటింట్లోకి ఒకసారి తొంగి చూద్దామా. స్త్రీ జీవితంలో తనదంటూ ప్రాముఖ్యతను సంతరించుకున్న వంటింట్లో సహితం ఆధ్యాత్మికత దాగి ఉంది సుమా! అది గమనించే ప్రయత్నమే ఇది.

గృహిణులు ఏనాడూ తాము 'వంటింటి కుందేలు'గా కాలం గడుపుతున్నామని భావించకూడదు. వంటిల్లు ఆహారపరమైన అవసరాలకే పరిమితం కాదు. అందులోని ఆధ్యాత్మిక సందేశాలు మనల్ని 'సాధన' దిశగా అడుగులు వేయిస్తాయి.

ఇప్పుడు మనం వంట గదిలో ఉపయోగించే సామగ్రిని ఒకసారి పరిశీలిద్దాం. చేట ఏమంటుంది? 'సాధువు చేటలా ఉండాలి' అన్నారు కబీరుదాసు. ఏమిటి చేట నేర్పే పాఠం? ఉపయోగపడే పదార్థాన్ని తనవద్ద ఉంచుకుని పనికిరాని చెత్తను ఎగరగొడుతుంది.

ఇక తిరగలిని గమనించండి. ఆ దైవాన్ని గట్టిగా పట్టుకొమ్మని అది మనకు సూచిస్తుంది. ఎలా? తిరగలిలోని క్రింది రాయికి ఒక ఇనుపపొన్ను ఉంటుంది. పైనుండి గింజలువేసి, కొయ్యపిడిని పట్టుకుని గుండ్రంగా త్రిప్పితే ఆ గింజలు రెండు రాళ్ళమధ్యలో పడి నలిగిపోతాయి కదా! కానీ, ఆ ఇనుపపొన్నుని ఆనుకుని ఉన్న గింజలు మాత్రం నలిగిపోకుండా అలానే ఉంటాయి. అలాగే ఆ దైవాన్ని ఆశ్రయించిన భక్తుడు సమస్యల సుడిగుండంలో కూడా సుక్షేమంగా ఉండగలడు.

వంట ఇంటిలో ఇంకొక ముఖ్యమైన పరికరం చాకు. దానితో ఎన్నో పనులు చేస్తుంటాము.

"హంతకుడు, కసాయివాడు, డాక్టరు, వంట చేసేవారు వీరందరూ చాకు నుపయోగిస్తారు. ఈ చాకులన్నింటి నడుమ అయస్కాంతం ఉంచితే అన్నీ ఒకేలా ఆకర్షింపబడతాయి; వాటిద్వారా చేయబడ్డ కర్మలకనుగుణంగాకాదు. భగవంతుడు 'అయస్కాంతం' లాంటివాడు. ఆయన దృష్టిలో అన్ని చాకులు సమానమైనవే. కానీ ఆ చాకులని ఉపయోగించిన చేతులు మాత్రం అవి చేసిన మంచి చెడుల ఫలితం అనుభవించాల్సిందే."

వంట చేయటానికి కావలసినది అగ్ని. మరి ఆ అగ్ని నుండి మనం నేర్చుకోవలసినది ఏమిటి? స్వామి వివరిస్తున్నారు:

“అగ్ని ఒకటే అయినప్పటికీ వినియోగ విధానాన్ని బట్టి దానిని ఒకచోట మంగళకరమైనదిగా, మరో చోట అమంగళకరమైనదిగా భావిస్తున్నాము. స్మశానంలో దేహాన్ని కాల్చేది అగ్నే. అయితే, అక్కడ అగ్ని ఉంటుండాదని దోసెలు, ఇడ్లీలు చేసుకుంటూ కూర్చుంటామా! ఆ అగ్నిని అమంగళకరమైనదిగా భావిస్తున్నాము. ఒక యజ్ఞం చేస్తున్నాము. అక్కడ అగ్నిని దేవతా మూర్తిగా ఆరాధిస్తూ ‘అగ్నిదేవుడు’ అంటున్నాము. మన ఇంట్లో వంట చేసుకుంటున్నాము. అదీ అగ్నే. ఇంకొకడు సిగరెట్ తాగుతున్నాడు. అక్కడా అగ్నే. కానీ, ఆ అగ్నికి ఎవరైనా నమస్కరిస్తారా! ఇంకొకడు ఊదువత్తులు వెలిగించి భగవంతుని చుట్టూ త్రిప్పి నమస్కరిస్తున్నాడు. అగ్ని ఒక్కటే అయినప్పటికీ దాని వినియోగ విధానములు వేరువేరుగా ఉంటున్నాయి. అట్లే, దైవత్వం ఒక్కటే. ఉపయోగించుకొనే విధానం బట్టే ఈ మంచిచెడ్డలు. కట్టెలో అగ్ని నిక్షిప్తమై ఉన్నట్లుగా దేహమనే కట్టెలోకూడా అగ్ని చేరి ఉన్నది. దీనిని సరియైన రీతిలో ఉపయోగపెట్టుకోవాలి.”

వంట గదిలోని ఆహార పదార్థాలుకూడా మనకు ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు బోధిస్తాయి. ఉదాహరణకు, పాలు. పాలలోని అణువణువులో వెన్న దాగియున్నట్లుగా జగత్తులో దైవం అంతటా వ్యాపించి ఉన్నాడు. వెన్న తీయటానికి చేసే ప్రక్రియలా సాధన చేయటంవల్లనే దైవం సాక్షాత్కరిస్తాడు.

చక్కెర: ఒక గ్లాసు నీళ్ళలో చక్కెరవేసి కేవలం పై నీళ్ళు త్రాగితే చక్కెర రుచి రాదు, స్పూన్‌తో కలపాల్సిందే. అలాగే మన హృదయమనే పాత్రలో అడుగున దివ్యత్వమనే చక్కెర ఉంది. పైన ప్రాకృత విషయాలనే నీరు చేరి ఉంది. బుద్ధి అనే స్పూన్ వేసి భగవత్ చింతనతో కలిపినప్పుడు దివ్యత్వమనే చక్కెర హృదయమంతా వ్యాపించిపోతుంది. అప్పుడు మన మనోవాక్కాయ కర్మలకు మాధుర్యం చేకూరుతుంది.

బియ్యం: వడ్ల గింజ మీద పొట్టున్నంతవరకు ఏ భూమిలో పెట్టినా దానికి ‘పునరపి జననం పునరపి మరణం’ అన్నట్లుగా వృద్ధి క్షయములు తప్పవు. ఆ పొట్టును తీసివేసి బియ్యపు గింజను నేలలో వేస్తే, ‘పునర్జన్మ నవిద్యతే’ అన్నట్లుగా దానికిక పుట్టుక ఉండదు. అలాగే మన మనస్సును ఆవరించిన కోరికలనే పొట్టును పూర్తిగా తీసివేసినప్పుడే జన్మరాహిత్యం కలుగుతుంది.

ఇలా ఆహార పదార్థాలలో దాగి ఉన్న ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను భగవాన్ మనకు తెలియజేశారు.

వండిన పదార్థాన్ని దైవానికి నివేదిస్తే అది ప్రసాదంగా మారిపోతుంది. లేకపోతే అది కేవలం పదార్థం మాత్రమే. అంతేకాదు. వంట చేసేటప్పుడు శుచిగా, భక్తిగా, నిర్మలమైన మనస్సుతో చేయాలి. నామస్మరణ చేస్తూ చేసిన వంట తినేవారికి ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది, మేలు చేస్తుంది. ఇంటి పనులతో తీరిక లేక సేవా కార్యక్రమాలకు, సత్సంగమునకు వెళ్ళలేకపోతున్నామని బాధపడే మహిళలకు భగవాన్ ఇచ్చిన సందేశమేమిటో తెలుసుకుందామా!

“మీరు బియ్యంలోని రాళ్ళను ఏరివేసేటప్పుడు దుర్గుణాలను దూరం చేసుకుంటున్నామని భావించండి. కూరగాయలను కోసేటప్పుడు, “నాలోని అరిషడ్వర్గాలను వివేకమనే కత్తితో కోస్తున్నాను” అనుకోండి. ఆ కూరలను ‘ప్రేమ’ అనే జలములో తడిపి జ్ఞానమనే అగ్నిలో ఉడకబెడుతున్నాను అని భావించండి. అప్పుడా పని ఎంతో పవిత్రతను సంతరించుకుంటుంది. మీరు చపాతీలు, పూరీలు చేస్తుంటారు కదా! “నేను వత్తేది పూరీలు కాదు, నా హృదయాన్ని విశాలం చేసుకుంటున్నాను” అనుకుంటే ఎంత బాగుంటుంది!”

ఇలా మంచి మనసుతో, పవిత్రమైన భావంతో వంట చేసి అన్నార్తులను, అతిథి అభ్యాగతులను ఆదరించటం

ఉత్తమమైన సేవాధర్మమే కదా! సాక్షాత్ పరమాత్మకి ప్రత్యక్షంగా ఆహారం నివేదించి తరించిన భక్తురాండ్ర చరితలు 'సాయి భాగవతం'లో పలు సందర్భాలలో తళుక్కుమంటూ దర్శనమిస్తాయి. మచ్చుకి రెండు మూడు ఉదాహరణలు:

శిరిడీ సాయినాథుని సచ్చరిత్రలోని 'బాయజాబాయి' నామం ఈ సందర్భంలో స్మరించతగినది. ఒక గంపలో రొట్టె, కూర తీసుకొని అడవిలో ముళ్ళు, రాళ్ళు లెక్కచెయ్యకుండా బాబా ఎక్కడుంటే అక్కడికి నడచివెళ్ళి, ధ్యానంలో ఉన్న బాబా కళ్ళు తెరిచేవరకు వేచి ఉండి, తినమని ప్రార్థించేది. ఆపై ద్వారకామాయిలో కూడా తన సేవను కొనసాగించింది. అలాగే అతిథులను ఆదరించిన రాధాకృష్ణమాయి, బాబా అవతారం చాలించే ముందుగా వారి దివ్యహస్తాలమీదుగా నవవిధ భక్తికి ప్రతీకగా తొమ్మిది రూపాయలు పొందిన లక్ష్మీబాయి శిండే ధన్యులైనారు.

భగవాన్ శ్రీ సత్యసాయి అవతార దివ్యగాథలో కరణం సుబ్బమ్మగారు, సాకమ్మగారు, కుప్పం కుటుంబంవారు ఈసందర్భంగా స్మరణీయులే కదా! సుబ్బమ్మగారి గురించి స్వామి స్వయంగా అన్నారు, "ఆమెకి అసలు విశ్రాంతి అనేదే లేదు. ఎసట్లో బియ్యం పోస్తూనే ఉండేది, ఏదో ఒక పచ్చడి చేస్తూ రోట్లో పాత్రము తిప్పుతూనే ఉండేది." అలాగే సాకమ్మగారు స్వామివారి ఆరోగ్య ఆహార విషయాలలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. నరసమ్మగారు, కోనమ్మగారుకూడా ఈ కోవకి చెందినవారే. కోనమ్మగారు పెట్టే ప్రత్యేకమైన చారుని స్వామి ఎంతో మెచ్చుకునేవారు.

రుచికరమైన వంట చెయ్యటం ఒక కళ, ఒక సేవ, భక్తిపూరితమైన ఒక మార్గం. ఈవిషయంలో శ్రీవారు అనుగ్రహించిన సందేశాల సారం గ్రహించి, ఆధ్యాత్మిక మర్మం తెలుసుకుని, నిత్యం నామస్మరణతో పవిత్రమైన మనసుతో వంటకి ఉపక్రమిద్దాం.

గృహలక్ష్మి



మన పూర్వీకులు వివాహమైన స్త్రీకి గృహలక్ష్మి, ఇల్లాలు, ధర్మపత్ని, అర్థాంగి అనే ధర్మశాస్త్ర సమ్మతములైన బిరుదులిచ్చి గౌరవించేరు. స్త్రీ, పురుషులలో సహజంగా స్త్రీది సున్నితమైన మనస్సు. ఆమె సహనశీలి, ప్రేమమూర్తి. ఇంటి పనుల్లో నిమగ్నురాలైనా, ఉద్యోగ ధర్మాలు నిర్వర్తిస్తున్నా ఆమెను ప్రేమపూర్వకంగా అభిమానించడం భర్త ధర్మం. ఇది పురుషాధిక్య సమాజం అనే భ్రమలో స్త్రీని చులకన చెయ్యడం, ఆమెపై పెత్తనం చేస్తూ అవమానించడం అజ్ఞానం. ఆమెను నొప్పిస్తే కుటుంబ గౌరవం క్షీణిస్తుంది. "కలకంఠి కంట కన్నీరొలికిన సిరి ఇంట నుండ నొల్లదు" అనే పెద్దల మాట ఇప్పుడు అనుభవ జ్ఞాన ఫలితం. నీ ఇంటి గౌరవం ఇంట్లోని స్త్రీ కిచ్చే గౌరవం మీద ఆధారపడి ఉంటుంది.

- బాబా

ఏకత్వ సాధన

(భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి ప్రబోధల నుండి)

కొప్పరపు బాలామనోహర రావు

"సర్వం ఖల్విదం బ్రహ్మ" బ్రహ్మ పదార్థం అంతటా పరిపూర్ణంగా నిండియున్నది. ఈ సత్యాన్ని తెలుసుకోనిదే ఏకత్వ సాధన కుదరదు. ఆ బ్రహ్మపదార్థము ప్రపంచంలో 'ప్రేమ' అని వ్యవహరింపబడుతున్నది. ఏకత్వమైనదే దైవత్వం. ఏకత్వ భావనే ప్రేమ భావన.



ఉన్నది ఒక్కడే దేవుడు – అతను సర్వాంతర్యామి
ఉన్నది ఒక్కటే కులం – అది మానవ కులం
ఉన్నది ఒక్కటే మతము – అది ప్రేమమతము
ఉన్నది ఒక్కటే భాష – అది హృదయ భాష

అన్నారు భగవాన్ బాబా.

"పరమాత్మకు అంగము – ప్రకృతి
ప్రకృతికి అంగము – మానవత
మానవతకు అంగము – సమాజము
సమాజమునకు అంగము – శరీరము

కనుక వసుధ అంతా ఒకే కుటుంబము అన్నారు. వ్యక్తిత్వమే ప్రకృతిలో స్పందిస్తుంది. 'వ్యక్తిలోని ఏకత్వం త్రికరణశుద్ధి.' అనగా మనసు మాట క్రియలకు పొంతన ఉండటం.

'సమాజంలోని ఏకత్వం మానవత్వం'. అనగా మానవతా విలువలైన సత్యదృష్టి, ధర్మనిరతి, శాంతస్వభావము, ప్రేమాచరణ, అహింసాయుత ప్రవృత్తి. ఇట్టి మానవత్వాన్ని జీవితంలో పరిరక్షించుకొనేవాడే మానవుడు.

సమాజంలో అనైక్యత చెలరేగితే దేశం అల్లకల్లోలమై పోతుంది. వ్యక్తి స్థాయి నుండి ప్రపంచ స్థాయివరకు సంక్షోభం సాక్షాత్కరిస్తుంది. అదే ఏకత్వ సాధనవల్ల ప్రేమ పెంపొంది, సత్యస్ఫురణ కలిగి, ధర్మజీవనం, ప్రశాంత వాతావరణము వర్ధిల్లి, ఎట్టి హింసా ప్రవృత్తులకూ అవకాశం లేకుండా అహింస సుస్థిరంగా వర్ధిల్లుతుంది.

"వ్యక్తి ప్రశాంతతపైనే ప్రకృతి ప్రశాంతత ఆధారపడి ఉంటుంది."

సమాజంలో మానవత్వం వర్ధిల్లాలంటే నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక ఏకత్వం సాధించాలి అని అంటారు భగవాన్ బాబా.

సమత్వమే ఏకత్వము

సమత్వము ఐదు విధములుగా ఉంటుంది.

1. ప్రాకృతిక సమత్వము: సుఖ దుఃఖములయందు, శీతోష్ణములయందు సమత్వం పాటించుట. శీతోష్ణములు రెండూ మానవునకు ఆనందాన్ని అందిస్తాయి. ప్రకృతి

పరిణామములు ఆనంద ప్రాప్తికోసమే. చావు పుట్టుకలు, సుఖ దుఃఖములు లౌకిక కారణాతీతములు. వీటికి కారణం మన కర్మల ప్రభావమని గుర్తించి వర్తించాలి. కాల మార్పు సుఖ ప్రాప్తికే. విషాదమునందు కూడా సమత్వమును అనుభవించాలి. "కష్ట సుఖములు కావటి కుండలు."

2. సామాజిక సమత్వము: లౌకిక వ్యవహారాలలో లాభం వస్తే, కీర్తి వస్తే ఆనందిస్తాము. నష్టమొస్తే అపకీర్తి వస్తే దుఃఖిస్తాము. మంచి చెడులకు చలించకుండా ఉండటమే సామాజిక సమత్వము.

"కష్ట సుఖములు రెండును కలసియుండు
వీని విడదీయ నెవ్వరి తరము కాదు
సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము
కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు"

అన్నారు బాబా.

3. జ్ఞాన సమత్వము:

అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించి వర్తించుటే జ్ఞాన సమత్వము.

4. భక్తి సమత్వము

"సర్వ జీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి", "సర్వ జీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" సర్వజీవులయందు దైవమును చూచుట, అందరిలోనున్న దైవత్వము ఒక్కటేనని ప్రేమించుట భక్తి సమత్వము.

5. కర్మ సమత్వము

ఏకాత్మ భావనతో నిష్కామ కర్మాచరణయే కర్మ సమత్వము.

ఏకత్వ సాధనకు సాధనములు

భగవంతుడు భావప్రియుడేకాని బాహ్యప్రియుడు కాదు.

"యోగమంటే సమత్వమే"

'సమధీ'యే సమాధి.

త్రిగుణాత్మకమైనది ప్రపంచం. అనగా ఈశ్వర, జీవ, ప్రకృతుల స్వరూపము. త్రిగుణాత్మకమైనదే మాయ.

సత్త్వమునందు ప్రతిబింబించిన ఆత్మస్వరూపమును ఈశ్వరుడన్నారు. రజోగుణమునందు ప్రతిబింబించిన ఆత్మస్వరూపమును జీవుడన్నారు. తమోగుణమునందు ప్రతిబింబించిన ఆత్మస్వరూపమును ప్రకృతి అన్నారు.

ఈవిధంగా మూడుమూడుగా విభజింపబడినవేకానీ ఈ మూడింటిలో ప్రతిబింబించేది ఒక్క ఆత్మయే. అదే దైవ సమత్వము.

దోషములు, వికారములు ప్రతిబింబమైన జీవునికి ఉండునేకాని, ఆత్మకు ఎట్టి వికారములూ ఉండవు.

మానవునియందు బహిర్దృష్టి, అంతర్దృష్టి అని రెండు ఉంటాయి. కానీ, ఈనాటి మానవుడు అంతర్దృష్టిని కోల్పోవటంచేత దేనినీ విశ్వసించలేకపోతున్నాడు. జగత్సంబంధమైన వ్యవహారమే సత్యమని భావించిన, కొద్ది కాలములోనే అది అసత్యముగా మారుతున్నది.

అంతస్సంబంధమైన భావస్వరూపముల ప్రతిబింబమే జగత్తు. భావోద్రేకములను అరికట్టనిదే సమత్వము సిద్ధించదు. భగవంతుని అంశమే జీవాత్మ. కాని జీవాత్మ సంబంధము కేవలము మనస్సుదే. ఏకత్వానుభూతికి మనస్సే అడ్డుగోడ. ఏకత్వ సాధనకు సాధనములు ప్రేమ, సేవ. భగవత్ప్రీతికి పాత్రులు కావాలంటే అందరినీ ప్రేమించాలి, అందరినీ సేవించాలి. ఈవిధంగా మనస్సులోని మాలిన్యాలను తొలగించుకోవాలి. ఆత్మసంబంధంతోనే ఏకత్వ సాధన సాధ్యము.

ఏకత్వమే సమత్వము.
సమత్వమే దైవత్వము.
దైవత్వమే ఆత్మతత్త్వము.
ఆత్మతత్త్వమే మానవత్వము.

అవ్యక్తమైన దివ్యత్వాన్ని వ్యక్తీకరించేవాడే వ్యక్తి అన్నారు, భగవాన్. దివ్యత్వం అంటే రాకపోకలు లేని తత్త్వం. అదే అమృతతత్వం. అఖండ పరమ ప్రేమతత్త్వం. ఆత్మతత్త్వం. ఆనందతత్త్వం. ఈశ్వరత్వం. బ్రహ్మతత్త్వం. అదే శ్రీ సత్యసాయి తత్త్వం. దాన్ని అందుకొనుటకు సత్యముచేత వాక్కును, జలముచేత శరీరమును, జ్ఞానముచేత బుద్ధిని, తపస్సు (సేవాతపన)చేత జీవితాన్ని పవిత్రం చేసుకోవాలి. P

శ్రీ సత్యసాయి బాలవికాస్:

తల్లిదండ్రులను మరచినవాణ్ని దేవుడైనా కాపాడలేడు

తల్లిదండ్రులే దైవ స్వరూపులని విశ్వసించి వాళ్ళకి కృతజ్ఞతను అందించాలి. ఈనాటి పిల్లలు స్వార్థస్వప్రయోజనాలకై ప్రాకులాడుతున్నారేగాని, తల్లిదండ్రుల సుఖసంతోషాలకై పాటుపడటం లేదు. ఎలాంటి పరిస్థితియందైనా మీ తల్లిదండ్రులకు దుఃఖం కలిగించకండి. సాధ్యమైనంతవరకు వారిని సంతృప్తిపరచండి. అప్పుడే మీకు దైవం సహాయం చేస్తాడు.

ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు లోక సంచారం చేస్తూ మార్గమధ్యంలో ఒక వ్యక్తి చెట్టుకొమ్మపై కూర్చొని ఉండటాన్ని చూశారు. ఆ కొమ్మ ఏక్షణంలోనైనా విరిగిపోవటానికి సిద్ధంగా ఉంది. ఈవిషయాన్ని గమనించి పార్వతి, "నాథా! అతనిని రక్షించు" అని ప్రార్థించింది. అప్పుడు ఈశ్వరుడు, "పార్వతీ! మొట్టమొదట చూసినదానవు నీవు. కాబట్టి నీవే రక్షించు" అన్నాడు తమాషాగా. "నాథా! నీ అనుగ్రహం లేకుండా నేనెలా రక్షించగలను! నీవుకూడా సంకల్పించుకున్నప్పుడే కదా అతనిని రక్షించడానికి వీలౌతుంది" అన్నది. అప్పుడు ఈశ్వరుడు, "పార్వతీ! కారణం లేని కార్యం జరగటానికి వీలుకాదు. అతడు మనల్ని కనీసం పిలవనైనా పిలవాలి కదా! పిలవకుండా ఎట్లా రక్షించేది? పిలవని పేరంటానికి ఎవరైనా వెళతారా?" అన్నాడు. అప్పుడు పార్వతి ఒక సలహా చెప్పింది. "ఈశ్వరా! నేను అమ్మను, నీవు అప్పవు. కాబట్టి వాడు క్రిందపడేటప్పుడు 'అమ్మా!' అంటే నేను వెళ్ళి రక్షిస్తాను. 'అప్పా' అంటే నీవు వెళ్ళి రక్షించాలి" అన్నది. ఈశ్వరుడు అంగీకరించాడు. వాడు ఎవరిని పిలుస్తాడా, అని ఇద్దరూ అక్కడ వేచియున్నారు. కాని వాడు 'అమ్మా!' అనలేదు, 'అప్పా!' అనలేదు. 'అయ్యో!' అంటూ క్రిందపడిపోయాడు. ఎందుకంటే, జీవితంలో వాడేనాడూ తన అమ్మను, అప్పను పూజించినవాడు కాదు. కనుకనే వాడి నోటినుండి 'అమ్మా!' రాలేదు, 'అప్పా!' రాలేదు. తల్లిదండ్రులనే మరచిన మూర్ఖుణ్ని ఏ దేవుడు రక్షిస్తాడు! కాబట్టి, తల్లిదండ్రులను ప్రేమించండి, వారి ఆజ్ఞను శిరసావహించి, వారి అనుగ్రహమును సంపాదించండి. వారికి మీరు కృతజ్ఞత చూపించినప్పుడే భగవంతుడు మీపై తన దృష్టిని ప్రసరిస్తాడు.

- బాబా

సంకలనం: డా॥ లావణ్య సరస్వతి

జ్ఞాపకాల పందిరి

(ధారావాహికం - 32వ భాగం)

ప్రొ॥ కామరాజు అనిల్ కుమార్

మన రేడియో సాయి డైరెక్టరు డా॥ వెంకట్రామన్‌గారు భగవాన్ బాబావారి ఢిల్లీ, బొంబాయి పర్యటనలగూర్చి కళ్ళకు కట్టినట్లు రాశారు. సందర్భం వచ్చినప్పుడల్లా **AK** అనే పేరుతో వారు నాగురించి తమ పుస్తకంలో ప్రస్తావించారు. పాఠకులకు ఆసక్తికరంగా ఉండవచ్చునని కొన్ని విషయాలు వ్రాస్తున్నాను.

బాబావారి ఢిల్లీ పర్యటన (1999) చారిత్రాత్మకం, అపురూపం, అద్వితీయం. రహదారులకు ఇరువైపుల మన ప్రశాంతి పతాకాలు రెపరెపలాడుతున్నాయి. తెల్లని దుస్తులు ధరించిన సాయి పూర్వ విద్యార్థులు పదిమంది మోటార్ సైకిళ్ళపై ప్రశాంతి జెండాలతో స్కార్ఫులతో మిలిటరీ స్టైలులో ముందుకు సాగుతూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఏ వాహనమైనా సరే ప్రక్కకి జరిగి స్వామి కారుకి, వెంట ఉన్న యాభై కార్లకి దారివ్వాల్సిందే! ట్రాఫిక్ మొత్తం ఆపివేసేవారు. శ్రీవారు ఢిల్లీలో ఉన్నన్ని రోజులు ఇదే పద్ధతి కొనసాగింది. రాజాధిరాజు మన స్వామి. సర్వ లోకాధ్యక్షుడు మన స్వామి. ఇక రాచమర్యాదలకు లోటేముంది! ప్రభుత్వ అధినేతలు, అధికార పక్షంవారు, ప్రతిపక్షంవారు అందరూ స్వామి భక్తులే! స్వామి దర్శనంకోసం అనేకమంది ప్రముఖ నాయకులు కాచుకొని ఉండేవారు. ఒకప్రక్క పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నా వీలుచూసుకుని దర్శనానికి వచ్చేవారు. దైవం ముందు మనమెంత, మన పీఠమెంత అన్నట్లుండేది వారి ధోరణి. ఓ రోజు బలే తమాషా జరిగింది.

యథాప్రకారం ఉదయం బయలుదేరింది స్వామివారి కాన్వాయ్. ముందుగా నిర్ణయించిన దారులగుండా
4 ప్రయాణం సాగుతోంది. అనుకోనిరీతిగా స్వామి తమ కారుని ప్రక్కకు మళ్ళించి వేరే రూటులో పోవలసిందిగా ఆదేశించారు. మిగిలిన అన్ని కార్లూ జోరుగా ముందుకు సాగిపోతున్నాయి. స్వామి ఉన్నారనుకుంటూ కార్లకి నమస్కారం చేస్తున్నారు దారిపొడవునా భక్తులు. మన స్వామి రూటు మార్చారు. ఎక్కడికనుకున్నారు? శ్రీ సత్యసాయి సంస్థల మహిళల సేవాశిబిరానికి చేరేరు. అక్కడ వారు చపాతీలు సిద్ధం చేస్తున్నారు, వేల సంఖ్యలో. ఒక ఫ్యాక్టరీలాగా ఉంది. ఎవరి పనులలో వారు నిమగ్నులై ఉన్నారు. ఒక వారంరోజులపాటు రెండు పూటలా వేల సంఖ్యలో చపాతీలు సిద్ధం చేయటం సామాన్యమైన విషయమా! భజన పాటలు పాడుకుంటూ ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉన్నారు. ఒకరినొకరు గమనించటం లేదు. స్వామి రాకను కూడా వారు గమనించలేదు. వారికి అనుకోకుండా ఆకస్మికంగా అందిన అదృష్టమది. వారి మధ్యలో నిలబడి భగవాన్, **"అమ్మా! నేను సాయిబాబాను. మిమ్మల్ని ఆశీర్వదించడానికి వచ్చాను"** అన్నారు.

ఇంకేముంది! ఎక్కడివారు అక్కడే తమ చేతిలో ఉన్నది కింద పడేసి, గబగబా స్వామి దగ్గరకు వస్తున్నారు. "సాయిరాం" నామంతో ప్రాంగణమంతా హోరెత్తిపోతోంది. చిరునవ్వుతో అందరినీ ఆశీర్వదిస్తూ బాబావారన్నారు, **"అందరూ నన్ను దర్శించుకోవటానికి అక్కడికి వస్తుంటే, మీకు దర్శనమివ్వటానికి నేను ఇక్కడికి వచ్చాను"** అన్నారు. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. "ఎక్కడైతే నా భక్తులు నామసంకీర్తన చేస్తుంటారో అక్కడ నేనుంటాను" అని శ్రీమహావిష్ణువు నారదునికి తెలిపినట్లుగా, "ఎక్కడైతే నా భక్తులు సేవ చేస్తుంటారో అక్కడ నేనుంటాను" అంటున్నారు భగవాన్. మనం ఏమాత్రం సేవ చేసినా, ఏకొద్దిపాటిదైనాసరే, పరమానందభరితులవుతారు స్వామి.



"శ్రమ కాదు బంగారూ, ప్రేమ"

ఎంత చేశాము అనేదానికన్నా ఏ భావంతో చేశాము అన్నది భావప్రియులైన బాబాకు ప్రధానం. పదిరోజులపాటు ఢిల్లీ మహానగరంలో వేలమందికి వసతి, భోజనాలు ఏర్పాటు చేసిన ఆ సాయి భక్తుల సేవానిరతిని, వారికి స్ఫూర్తి నందించిన భగవాన్ దివ్యప్రేమను మనం ఏమని వర్ణించగలము! ఆ ఏర్పాట్లు ఏ స్థాయిలో ఉన్నాయి! వర్ణనాతీతమనుకోండి.

శివరాజ్‌పాటిల్‌గారు భగవాన్ గౌరవార్థం విందు ఏర్పాటుచేసి, ప్రముఖులను ఆహ్వానించారు. విశాలమైన వారి ఇంటిముందు పెద్ద షామియానా వేశారు. అక్కడ వేసిన అన్ని కుర్చీలు, సోఫాలు కేంద్ర రాష్ట్ర మంత్రులకు, గవర్నర్లకు, సైన్యాధికారులకు, పార్లమెంటు సభ్యులకే సరిపోలేదు. అస్మదాదులం నిలబడవలసి వచ్చింది. భోజనాలు ప్రారంభమయ్యే ముందు పెద్దా చిన్నా తారతమ్యాలు, వయసు హోదాలు మరచి ముందు సీట్లకొరకు ఒకటే పరుగు! స్వామి దివ్యాకర్షణ అది. లౌకిక, ప్రాపంచిక స్థితి గతులకు అతీతమైనది వారి దివ్యాకర్షణ.

ఢిల్లీకి చాలా సంవత్సరాల తరువాత వచ్చారు స్వామి అన్న భావనతో పెద్దలందరూ స్వామిని వారివారి గృహాలకు ఆహ్వానించేవారే! ప్రతిచోట కూర్చోవటం, సంభాషించటం, ఆశీర్వదించటం, ఆనందాన్ని పంచటం, మరో గృహానికి తరలి వెళ్ళటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎవరి గృహంలోనైనా సరే, వడ్డించినవాటిని స్వామి కేవలం స్పృశించటం, అందరూ అది నైవేద్యంగా, మహా ప్రసాదంగా భావించటం మామూలైపోయింది. ఉదయం ఆరు బ్రేక్‌ఫాస్టులు, ఆరు లంచ్‌లు, రాత్రి ఆరు డిన్నర్లు పూర్తయ్యేసరికి రాత్రి పది పదకొండైపోయేది. బాబావారు, "అనిల్ కుమార్! చాలా ఆలస్యమైంది, మీరంతా వెళ్ళండి. నేను ఇంకా కొందరికి దర్శనం ఇవ్వవలసి ఉన్నది" అన్న సందర్భాలుకూడా ఉన్నాయి. మళ్ళీ మరుసటి రోజు ఉదయానికి చాలా ఫ్రెష్‌గా స్వామి దర్శనమిచ్చేవారు. ప్రాభాత సమయంలో ఎంత ఫ్రెష్‌గా, అందంగా, ఆనందంగా ఉండేవారో రాత్రి పది పదకొండు దాటినా అలానే ఉండేవారు. మనము గంటకొకసారి దాణా వేసుకుంటున్నా, ముఖాలు కడుక్కుని ఫేస్ పౌడరు పూసుకున్నా మళ్ళీ అరగంట తిరిగేసరికి ఆముదం ముఖాలైపోతాయి! నీరసాలు వచ్చేస్తాయి. కనుకనే, కారుణ్యానందస్వామి అంటూండేవారు, **"స్వామిది మన వలె మృణ్మయ శరీరం కాదు, వారు చిన్మయస్వరూపులు"**

స్వామి ఎయిర్‌పోర్టులో ప్రవేశించేసరికి ప్రముఖులు, ప్రభుత్వాధినేతలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలకటం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆధ్యాత్మిక ప్రపంచంలో వేరెవరికీ లభించని అపూర్వ విశేష ప్రత్యేక విశిష్ట స్వాగత ఆతిథ్య గౌరవ సత్కారాలు భక్తి ప్రపత్తులతో అందింప బడినది ఒక్క భగవాన్ బాబావారికే అని ఘంటాపథంగా చెప్పవచ్చును. బాబా సద్గురువైన దివ్యావతారమూర్తి. ఆధ్యాత్మిక బోధన సాధన లందించే సద్గురువుగా సాక్షాత్తు అవతారమూర్తి శ్రీ సత్యసాయిబాబావారు లభించటం వర్తమాన ఆస్తిక లోకానికి లభించిన మహావరం, మహద్భాగ్యం.

ఢిల్లీలో రాయ్ స్కూలులో చేరిన వేలాదిమందికి ఆశీస్సులందించటం, శ్రీ సత్యసాయి స్కూలు సందర్శనం, వారి సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించటం శ్రీవారి

దినచర్యలో భాగమైపోయింది. చాలా దూరంలో ఉన్న భక్తుల గృహాలను కూడా పావనం చేసి వారిని సంతోషపెట్టారు, భగవాన్. ఎక్కడా శ్రమ అనుకోలేదు. మన శ్రమలు తీర్చే స్వామికి శ్రమ ఎక్కడుంటుంది!

ఆనాటి బృందావనం క్యాంపస్ వార్డెన్ నరసింహమూర్తిగారు ఓ సందర్భంలో, "స్వామీ, చాలా శ్రమ తీసుకున్నారు" అన్నారట. నర్సింహమూర్తిగారు అస్వస్థులైనప్పుడు స్వామి స్వయంగా హస్టల్‌లోని వారి గదికి వచ్చినప్పుడు అన్న మాటలివి. **"శ్రమ కాదు బంగారూ, ప్రేమ"** అని స్వామి సమాధానమిచ్చారు. ఎంత చల్లని మాట! ఎంత చక్కని మాట!

ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో చేరిన లక్షలాది మంది నుద్దేశించి స్వామి చేసిన దివ్య ప్రసంగం ధార్మిక నైతిక ఆధ్యాత్మిక సత్యాలను ఆవిష్కరించింది. అంతర్జాతీయ వేదికను స్వామి అలంకరించటంతో దానికి సార్థకత చేకూరిందనిపించింది. శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ సెంటర్‌ను స్వామి ప్రారంభించారు. సువిశాలమైన స్థలంలో ఇటుక ఎరుపు వర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మింపబడిన ఈ కేంద్రం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పేరుగాంచిన పెద్దలు, వివిధ రంగాలలో నిష్ణాతులైనవారు ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

ఢిల్లీకి మేము వెళ్ళిన విమానం చాలా చిన్నది. ఆరుగురే కూర్చోవచ్చు. తిరుగు ప్రయాణంలో మరొకరు చేరటంతో, "ఇక్కడకు వచ్చి కూర్చో" అంటూ నన్ను తమ పాదాలదగ్గర కూర్చోబెట్టుకున్నారు, భగవాన్. బొంబాయి, ఢిల్లీ పర్యటనల ముచ్చట్లు చెప్పుకున్నాం. అనుకున్నంత కాలం పట్టలేదు. అప్పుడే అయిపోయిందా అని తలుచుకుంటూనే బాధ మొదలైంది. మెల్లగా నా బాధను స్వామి ముందు వెళ్ళబోసుకున్నాను, "స్వామీ, అప్పుడే ట్రిప్పు పూర్తి కావస్తున్నది. నా బంగారు కల కరిగిపోతోంది."

"ఎందుకలా అంటావు? స్వామితో ఆనందం, అనుభూతి కరిగేది కాదు, చెదిరేది కాదు. నిత్యానుభవంలో ఉంటుంది" అన్నారు, భగవాన్.

"స్వామీ, ఇలాంటి అరుదైన అవకాశం మళ్ళీ ఎన్నాళ్ళకో?' అన్నాను కళ్ళ నీళ్ళతో.

"ఆవిధంగా ఏనాడూ తలంచకు. నీవెప్పుడూ నాతోనే ఉంటావు, నావెంటే ఉంటావు. అన్ని ఉపన్యాసాలని ట్రాన్స్‌లేట్ చేస్తావు. నేను ఎక్కడికి వెళ్ళినా తీసుకెళ్తాను" అన్నారు ఆ కరుణామూర్తి. ఈ మాటలు వెంకట్రామన్‌గారు కూడా విన్నారు, పుస్తకంలో రాశారు.

ఏమిటో ఏనాటి బంధమో నాకైతే తెలియటంలేదు. ఆ దయ అపారం. అర్హత స్తోమత స్థితిగతులతో నిమిత్తం లేదు. ఆ ప్రేమామృత వృష్టి అలాంటిది. వాటిని తలుచుకుంటూ నెమరు వేసుకుంటూ, స్వామి మాటల జ్ఞాపకాల పందిరిని పదిలపరచుకుంటూ, ఆప్తులతో, సాయిబంధువులతో ఆ దివ్యస్మృతులను పంచుకుంటూ కాలాన్ని గడుపుతున్నాను. వారి సందేశాన్ని, అనుభవాలని అందరితో చెప్పుకోవాలన్న నిరంతర తీవ్ర తపన తప్ప నాకు ఏమాత్రం జీవితాశ లేనేలేదు. ఈ జన్మకిది చాలు, ఒకరకంగా ఎక్కువే అనాలి, ఒప్పుకోవాలి.

మొత్తానికి బెంగళూరు చేరుకున్నాం. సాయంకాల మైంది. భక్తులు, విద్యార్థులు స్వామికి స్వాగతం పలికారు. 'త్రయీ బృందావనం' మందిరంలోకి వెళ్ళినారు స్వామి. వెంట ఉన్న పరివారం సర్దుకుని మెల్లగా మందిరం చేరుకుంటున్నాము. బృందావనం గేటుదగ్గర సేవాదళంవారు నన్ను ఢిల్లీ యాత్ర విశేషాలు అడిగారు. ఇక నేను మొదలుపెట్టేను. ఈలోగా ఒక స్టూడెంటు పరుగెత్తుకుంటూ వచ్చి, "సార్, మిమ్మల్ని స్వామి రమ్మంటున్నారు" అన్నాడు. వెంటనే వడివడిగా మందిరానికి వెళ్ళేను.

"మొదలుపెట్టావా అప్పుడే! రేపు ఉదయం ఇక్కడ నీ లెక్చరుంటుంది. ఇంతలోగా నీకు తొందరా! అయినా నీకు ఏదీ ఆగదు, దాగదు" అన్నారు నవ్వుతూ. మిగిలిన పెద్దలతో కూర్చుని స్వామి సన్నిధిలో కాఫీ, టిఫిన్లు ముగించుకొని రూము చేరుకున్నాను. ఈ ట్రిప్పులోనే ఒకరోజు బొంబాయి కూడా వెళ్ళటం జరిగింది. అక్కడ కూడా ఢిల్లీ యాత్ర ఎంత బాగా జరిగింది; భారీ ఏర్పాట్లు ఎంత బాగున్నాయి; భక్తులు, ప్రముఖులు, పెద్దలు ఎలా తరలివచ్చారు, అన్న విషయాలే పదేపదే ప్రస్తావనకు వచ్చాయి.

(సశేషం)

"నేను అందరి సేవకుడిని"

ఆదూరి శ్రీనివాసరావు

స్వామివారు ఒకసారి దర్శనం లైన్లలో నడుస్తుంటే ఒక భక్తుడు లేచి, "స్వామీ, నా స్నేహితునికి హార్ట్ ఎటాక్ (గుండెపోటు) వచ్చింది" అని విన్నవించాడు. స్వామి అతనికేసి కోపంగా చూస్తూ, "ఇప్పటికి మూడుసార్లు అతనిని హార్ట్ ఎటాక్ నుండి రక్షించాను. నన్నుగురించి ఏమనుకుంటున్నాడు? నేనేమైనా అతనికి సర్వెంటునా చెప్పు" అన్నారు. స్వామి కోపంగా అన్న ఆ మాటలు విని ఆ భక్తుడు బిత్తరపోయాడు. స్వామి ఒక అడుగు ముందుకు వేసి నవ్వుతూ, "ఔను, నేనతనికి సేవకుడినే" అంటూ సాగిపోయారు. ఈ దృశ్యాన్ని చూసినవారుగానీ, విన్నవారు గానీ కన్నీరు కార్చక మానరు. విశ్వానికి అధిపతి అయిన విశ్వేశ్వరుడు శ్రీ సత్యసాయిగా అవతరించి, "నేను అతనికి సేవకుడినే" అనటం సేవయొక్క పవిత్రతను, విశిష్టతను సూచిస్తున్నది.

వైట్‌ఫీల్డులో ఒకసారి నారాయణ సేవ చేస్తున్నారు. స్వామి స్వయంగా వడ్డిస్తున్నారు. ఒక స్త్రీ ప్రసాదాన్ని స్వీకరిస్తున్నది. ఆమె ఒళ్ళో ఉన్న పసివానిని చూసి స్వామి ఒక సేవాదళ్‌ను పిలిచి ఒక గ్లాసులో పాలు తీసుకొని రమ్మన్నారు. గ్లాసులో వేడి పాలను తీసుకొని వచ్చిన ఆ సేవాదళ్‌ను మందలించి మరో గ్లాసును తెప్పించి, పాలను చల్లార్చిన తరువాత ఆ బిడ్డకు ఇచ్చారు. అనగా మనం చేసే ప్రతి సేవలోనూ అతి జాగ్రత్తగా వ్యవహరించాలని, ఆ సేవ ఇతరులకు ప్రయోజనకారిగా ఉండేటట్లు చూసుకోవాలని భగవాన్ పాఠం నేర్పారు.

సేవవలన మనకు చేకూరు ఆనంద
మదియె శాంతి నిచ్చు, సుఖము నిచ్చు
శాంతికన్న మిన్న సౌఖ్యంబు లేదయా
ఉన్నమాట తెలుపుచున్నమాట - బాబా

అక్బరు చక్రవర్తి దగ్గర 'సేనా' అనే ఒక సేవకుడు ఉండేవాడు. నిత్యం అక్బరు అభ్యంగ స్నానమాచరించే ముందు సేనా అతని వంటికి బాగా నూనెరాసి మర్దనా చేసేవాడు. సేనా కృష్ణ భక్తుడు, కృష్ణుడే తన సర్వస్వం అనుకునే మహాభక్తుడు. ప్రతి రోజూ అక్బరు చక్రవర్తికి మర్దనా చేయటానికి బయలుదేరే ముందు కొద్దిసేపు శ్రీకృష్ణుని ధ్యానించేవాడు. అయితే, ఒకరోజు కృష్ణ ధ్యానంలో పూర్తిగా లీనమై సమయానికి బయల్దేరలేక పోయాడు.

యథాప్రకారం అక్బరు చక్రవర్తి అభ్యంగనానికి కూర్చున్నాడు. ఆరోజున తన వంటికి సేనా నూనె రాసి మర్దనా చేస్తున్నప్పుడు అక్బరు అమితానందం పొందుతున్నాడు. అంతకుపూర్వం ఎన్నడూ అతనికి ఈవిధమైన అనుభూతి కలుగలేదు. "సేనా! ఏనాడూ నాకింతటి ఆనందం కలుగలేదు. ఈరోజు నీ స్పర్శ ఎంతో దివ్యమైన అనుభూతి నిస్తున్నది" అంటూ తన ప్రక్కన పెట్టిన నూనె గిన్నెలోకి చూసేసరికి కృష్ణ పరమాత్మ దర్శనం అయింది. ముగ్ధమోహనమైన ఆ దివ్యరూపం చూసి పరవశించిపోయాడు. ఇంతలో 'సేనా' తన ఆలస్యానికి క్షమాపణ వేడుకుందామని పరుగెత్తుకుంటూ వచ్చాడు. అక్బరు కన్నులు తెరచి చూసేటప్పటికి అసలైన సేనా కనిపించాడు. అంటే, తన భక్తుని కాపాడటానికి శ్రీకృష్ణ పరమాత్మయే స్వయంగా వచ్చి అక్బరుకు అభ్యంగనం చేయించినాడు. భక్తునికోసం ఎంతటి అల్ప కార్యమైనా చేయటానికి సిద్ధంగా ఉంటాడు భగవంతుడు.

స్వామి తమ దివ్యహస్తాలను మన శిరస్సుపై ఉంచితే, **"నీ హస్త స్పర్శలో ఏ చలువ ఉన్నదో తనువు పులకరించి ధన్యమగును"** అనిపిస్తుంది. "నాకు ఆదివారం కూడా సెలవు లేదుకదా" అంటారు భగవాన్. కుప్పం నివాసి రాధాకృష్ణయ్య బావిలో పడినప్పుడు దాదాపు 5 గంటలు బావిలో ఉండి అతనిని మోసి రక్షించిన అనంతరం, "రాధాకృష్ణయ్యా! చూడు, నీ బరువు మోయలేక నా భుజాలు కాయలు కాసినాయి" అన్నారు, భగవాన్.

శ్రీమతి ఈశ్వరమ్మగారు తన దివ్యకుమారుడైన 'సత్యం' (బాల్యంలో స్వామిని ఆ పేరుతో పిలిచేవారు) ఉరవకొండనుండి పుట్టపర్తికి వచ్చినప్పుడు, 'తలంటి' పోస్తున్నప్పుడు వారి భుజాలమీద చర్మం కమిలిపోయి కాయలు కాసి ఉండటం గమనించి కారణమడుగగా, అతిబలవంతంమీద 'సత్యం' చెప్పారు, ఉరవకొండలో తన అన్నగారింటికి, ఇరుగుపొరుగువారికి నిత్యం నీటికావళ్ళు మోసుకొని రావటంవలన అని. "నీ మంచితనాన్ని ఇలా వాడుకుంటున్నారా నాయనా! చదువు మానేసి పుట్టపర్తికి వచ్చేసెయ్" అని ఆ మాతృమూర్తి అన్నప్పుడు 'సత్యం' చిరునవ్వుతో ఇచ్చిన సమాధానం, **"నేను వచ్చింది సేవ చేయటానికే కదమ్మా!"**

ఒకానొక సందర్భంలో 'ఆనె మేరీ మార్వా' అనే జర్మన్ భక్తురాలు, "స్వామీ, మీ అవతార తత్త్వమేమిటి?" అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, "నేను అందరి సేవకుడిని" అన్నారు భగవాన్. అది నాటికీ నేటికీ ఏనాటికైనా సత్యమే. స్వామి చేసే సేవతో పోలిస్తే మనం చేసేది ఎన్నో వంతు!

నాయకులూ సాధకులే

సమాజ సేవే అత్యున్నతమైన ఆధ్యాత్మిక సాధన. సత్యసాయి సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఆదర్శ సేవాసంస్థగా పేరు తెచ్చుకుంది. ఇందులో చెప్పేవాడొకడు, చేసేవాడొకడు లేడు. అందరూ సాధకులే! నాయకుడన్నవాడు ఎలాంటి సేవలోనైనా ముందు తను చేస్తూ, ఇతరులు చేసేటట్లు ప్రోత్సాహపరచాలి. చీమ ఒక తీపి పదార్థం చూసిందంటే తను స్వార్థంతో కడుపు నింపుకోదు. వెంటనే ఇతర చీమలను పిలుచుకొచ్చి పంచుకుంటూ తన నాయకత్వానికి మార్గదర్శకత్వం వహిస్తుంది. సేవలవలన కలిగే ఫలితమే నిత్యసత్యమైనది. ఏ సేవ చేసినా దైవనామ స్మరణతో, సంకీర్తనతో చేయండి.

- బాబా

మహా మహిమాన్విత ప్రేమావతారి

(ధారావాహికం - 44వ భాగం)

బి.వి. రమణరావు



సూటిగా కళ్ళలోకి చూడగా...

టాంజానియాలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన శ్రీమతి మాధ్వీ వృత్తిరీత్యా ఎకౌంటెంటు. ఆమె పెంపొందించుకున్న అభిరుచిరీత్యా సంగీతంలో ప్రావీణ్యం గడించింది. ఆమె సాయి భక్తురాలైన తరువాత మాధ్వీసాయి అని పేరు మార్చుకుంది. 'అర్పణ' అనే పేరున వెలువడిన ఆమె భజన గీతాలు వివిధ దేశాలలో సాయిసంస్థలద్వారా ప్రాచుర్యం పొందేయి. సంక్షిప్తంగా ఆమె మాటల్లోనే ఆమె అనుభవాలు చదవండి.

"నాకున్న ఆర్థిక స్తోమత, వృత్తిలోనూ సంగీతంలోనూ నేను గడించిన పేరు ప్రఖ్యాతులవల్ల 'ఫేషనబుల్ లేడీ'గా జీవిస్తూ వచ్చేను. శరీరానికి విశ్రాంతి, మనస్సుకు శాంతి కరువైన జీవన విధానం ఫలితంగా 1995లో తీవ్రమైన కంటి నరముల వ్యాధివల్ల చూపు మందగించింది. వైద్య సలహా పాటిస్తూ ఉద్యోగానికి రాజీనామా చేశాను. సంగీత సభలకు స్వస్తి చెప్పేను. అలా మూడు సంవత్సరాలు మానసిక సంక్షోభానికి గురి అయ్యేను. ఒక స్నేహితుడు నాకు చదవమని, 'సత్యసాయిబాబా – యుగావతార్' అనే పుస్తకాన్ని ఇవ్వటంతో నేను దాన్ని చదివి ప్రభావితురాలినై, చుట్టుప్రక్కల ఉన్న సాయి సంస్థలలో జరిగే భజనలకు వెళ్ళటం ప్రారంభించాను. దానితో నా జీవితం ఒక అద్భుతమైన మలుపు తిరిగింది. అర్థవంతమైన జీవితానికి, నూతన ఉత్సాహానికి అది నాంది అయింది.

1998 మార్చి నెలలో బెంగళూరుకు టికెట్ కొన్నాను. నా కండ్లకు ఆపరేషన్ చేసిన తరువాత వెళ్ళమని నా కళ్ళు పరీక్ష చేసిన సర్జన్ హెచ్చరించేడు. లేదు, నా ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నా, అందుచేత వెళ్ళి వచ్చేకనే చేయించుకుంటానని చెప్పి బయల్దేరి వెళ్ళేను. అప్పుడు వైట్‌ఫీల్డులోనే స్వామి ఉండటంవల్ల నిత్యం ఉదయం సాయంత్రం దర్శనానికి వెడుతూ అక్కడ భజనలతోనూ, భక్తుల పరిచయాలతోనూ ఆనందంగా గడుపుతూ వచ్చేను. వారం రోజులయింది. స్వామి నాకు దగ్గరగా ఎన్నడూ రాలేదు. ఆరోజు నా తిరుగు ప్రయాణం. నేను ఎప్పటిలాగే నాలుగైదు లైన్లు వెనుక కూర్చున్నాను. స్వామి దర్శనం సమయంలో మా ప్రక్కకు వచ్చినప్పుడు అంత దూరాన్నుంచీ తీక్షణమైన దృష్టితో ఒక్క క్షణం నా కళ్ళలోకి

చూశారు. నా ఒళ్ళు ఝల్లుమంది. కాలం స్తంభించినట్లయింది. బాబా దర్శన మిచ్చి వెళ్ళిపోయిన తరువాత కూడా కొన్ని నిమిషాలలాగే కూర్చుండిపోయాను.

టాంజానియా తిరిగి వెళ్ళేక సర్జన్ నా కళ్ళు పరీక్షించి నిర్ఘాంతపోయి గ్లౌకోమా పూర్తిగా మాయమైపోయిందనీ, ఆపరేషన్ అవసరంలేదని చెప్పాడు. నేను ఆశ్చర్యపడలేదు. స్వామి చూపుతోనే అభయం, అనుగ్రహం ప్రసాదించేరని గ్రహించేను. ఈ అనుభవమే నా జీవితంలో సరిక్రొత్త అధ్యాయాన్ని ప్రవేశపెట్టింది. స్వామి ప్రబోధల కనుగుణంగా నిరాడంబరత్వం, కోరికలపై అదుపు, ఉత్సాహపూరితమైన నిస్స్వార్థ మానవ సేవా కార్యక్రమాలలో ప్రవేశించేను. మా కేంద్రంలో భజన కేసెట్లు తయారు చేసి విస్తృతంగా పంచిపెట్టే విభాగానికి నేను కోఆర్డినేటర్ అవ్వటం స్వామి అనుగ్రహ ప్రభావం."

అద్భుత ఉంగరం

డా॥ ఉపేంద్ర ఆచార్య ముప్ఫయ్యయిదు సంవత్సరాలు ముఖ్యంగా దుబాయ్‌లో వైద్యవృత్తిలో ప్రావీణ్యం గడించి ప్రస్తుతం వైట్‌ఫీల్డు సత్యసాయి జనరల్ హాస్పిటల్‌లో సేవలందిస్తున్నారు. 1990 జనవరి 20వ తేదీన స్వామి ఆయనకొక అద్భుతమైన ఉంగరాన్ని సృష్టించి, దాన్ని ఉంగరం వేలుకు కాకుండా చూపుడు వేలుకు తొడిగి, దాని శక్తి ప్రసారంతో వృత్తిలో ఖ్యాతి గడించగలవని ఆశీర్వదించేరు. ఆ ఉంగరం యొక్క అద్భుత శక్తిని వర్ణిస్తూ ఆయన వ్రాసిన వ్యాసంలోని రెండు అనుభవాలను ఈ క్రింద పేర్కొనటం జరిగింది.

"1999లో దుబాయ్‌లో ఉన్న రషీద్ హాస్పిటల్‌లో నేను పర్యవేక్షించే ఒక వార్డులో ఒక 30 సంవత్సరముల బంగ్లాదేశ్ యువకుణ్ని చేర్చేరు. అతనికి తీవ్రమైన కీళ్ళనొప్పులు, ఒళ్ళంతా కురుపులు, విషజ్వరం. దానికి సాయం అంతకుముందు జరిగిన వైద్యంలో స్టిరాయిడ్స్ వాడటంవల్ల లివర్ దెబ్బతిని ఆకలి మందగించి ఆహారం లేక నీరసంగా మూలుగుతున్నాడు. నేను అతన్ని పరీక్షించడానికి వెళ్ళి అతని శరీరం తాకిన కొన్ని గంటలవరకూ వ్యాధి లక్షణాలు మరచిపోగలుగుతున్నాను అని అక్కడ ఉన్న నర్సింగ్ స్టాఫ్‌కి చెబుతున్నట్లు వాళ్ళు చెప్పేరు. అతనికి వ్యాధి నిర్మూలమై ఆరోగ్యవంతుడు కావాలని నేను బాబాను ప్రార్థించేను.

నేను చేసిన వైద్యం అత్యంత సాధారణమైనది. అయితే, ఆశ్చర్యంగా వారం రోజుల్లో కురుపులు మానిపోయేయి, లివర్ బాగా పనిచేయటం ప్రారంభించి ఆకలి వేసి ఆహారం చక్కగా తీసుకోగలుగుతున్నాడు. కీళ్ల నొప్పులు కూడా తగ్గిపోయి సంపూర్ణ ఆరోగ్యవంతుడై వెళ్ళిపోయేముందు నాకు కృతజ్ఞతాభివందనములు చెప్పుకున్నాడు. అతనితో నేను చేసిన వైద్యం కంటే బాబాను ప్రార్థించిన ప్రభావంవల్ల అతనికి నయమైందని చెప్పి బాబాను భక్తిపూర్వకంగా తలుచుకున్నాను.

అదే సంవత్సరం ఒక వృద్ధురాలైన భారతీయ మహిళ తన మోకాళ్ళమీద వచ్చిన తెల్లని మచ్చలు పోయే చికిత్స కొరకు నావద్దకు వచ్చింది. ఆ వయస్సులో ఆమె వ్యాధికి ఏ మందూ పనిచెయ్యదని నాకు తెలుసు. అయినా ఆమె తృప్తికోసం నా కుడిచేతి చూపుడు వేలుతో ఆ మచ్చలను తాకి పరిశీలిస్తుంటే అవి రంగు మారి గోధుమ రంగులో కనిపించాయి. తర్వాత అల్ట్రావాయిలెట్ ల్యాంపు కాంతిలో చూశాను. నా వ్రేలి ఉంగరం కాంతి ప్రసారంవల్ల రంగు మారటం గమనించాను. అలాగ వారం రోజులు ఉంగరం వేలుతో అల్ట్రావాయిలెట్ కాంతిలో ఆమె మోకాళ్ళ మచ్చలమీద సున్నితంగా రాయటం మొదలుపెట్టేను. ఇక ఏ మందులూ వాడలేదు, ఆ చికిత్స సమయంలో స్వామిని ప్రార్థించటం తప్ప. ఆశ్చర్యంగా వారం రోజుల్లో ఆ మచ్చలు మాయమై ఆమె చర్మం రంగులో కలిసిపోయేయి.

అప్పుడు నాకు కనువిప్పు కలిగింది. ఇన్నాళ్ళు ఎందరెందరో నా హస్తవాసిని పొగిడేవారు. ఇది నా చికిత్సల ఫలితం కాదనీ, నా వ్రేలికున్న ఉంగరం ప్రభావమనీ, ఉంగరంద్వారా స్వామి తమ అనుగ్రహ ప్రసార మహిమతో అద్భుతంగా వ్యాధులు నిర్మూలం చేస్తున్నారనీ ఆనాడు గ్రహించేను. జీవితాంతం వారి సేవలో తరించాలన్న ఆశయం నా హృదయంలో ఆవిర్భవించింది.

'నేను మీతోటే ఉంటాను'

2004 నవంబరు 19వ తేదీన ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబా దివ్యసన్నిధిలో గ్రీకు దేశస్తురాలైన హెలెన్ చేసిన ప్రసంగం నుండి సేకరించిన ఈ క్రింద పేర్కొన్న సంఘటనలు ఉత్తేజకరములు, భక్తిరస భరితములు.

"మీరు నిజమైన క్రైస్తవులయితే వెళ్ళండి, సమాజాన్ని సేవించండి. పేదల నాదరించండి. ఆర్తులను ఆదుకోండి" అని ఎన్నోసార్లు స్వామి ఉద్బోధించేరు. మీరు ఆత్మవిశ్వాసంతో సేవాసాధనలో ముందుకు నడవండి. నేనెప్పుడూ మీతోనే ఉంటూ మీకు తోడ్పడుతూ ఉంటాను" అన్న భగవానుని ప్రవచనమును, వాగ్దానాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి ఆర్తజన సేవారంగంలో ముఖ్యమైన కార్యకర్తగా రాజిల్లిన ధీమతి, ధైర్యశాలి హెలెన్. ఆమె అనుభవాలను కొన్నిటిని ఆమె మాటల్లోనే మీ ముందుంచుతున్నాం.

"బోస్నియాలో యుద్ధం చెలరేగింది. ఎందరో క్షతగాత్రులయ్యేరు. వారికి ఆహార పదార్థాల నందించే పనికి పూనుకున్నాం. శరణార్థులు గుంపులుగా చేరి ఉన్న ప్రదేశాలకు సాయంత్రం చీకటి పడుతున్న వేళ వెళ్ళేవాళ్ళం. మావెంట ఒక్కొక్క సంచీలో గోధుమలు, బియ్యం, పప్పు, ఉప్పు, పంచదారవంటివి మూటలు కట్టి, ఆ సంచీలో ఆ మూటలతోపాటు ఒక బాబా ఫోటో పెట్టి పంచిపెట్టేవాళ్ళం. సంచీ అందుకోగానే ఆత్రంగా ఆ సంచీలో చెయ్యిపెట్టి ఆ చీకటి వేళ అన్నీ ఉన్నాయో లేదో చూసుకుంటున్నారనుకున్నాం. వాళ్ళ భాష మాకు రాదు. అక్కడ ఉన్న పౌరుల సహాయంతో వాళ్ళు ఏమిటి వెతుకుతున్నారు అని కనుక్కుంటే సంచీలో ఉన్న బాబా ఫోటో! ఎందుకని అడిగితే, "ఈ మహానుభావుడు మాకు తరచు ఆహార పదార్థాలను, కావల్సిన ఔషధాలను ఇచ్చి వెడుతూ ఉంటాడు. ఆయన చిరునవ్వు, సానుభూతి వచనాలు మాకెంతో ఊరట కలిగిస్తాయి" అన్నది వాళ్ళ సమాధానం. ఎక్కడ బోస్నియా! ఎక్కడ పుట్టపర్తి!

అవి ఇరాక్ యుద్ధం జరుగుతున్న రోజులు. బాంబులు పడుతున్నా స్వామిమీద భారం వేసి 2003 మార్చి 23న బాగ్దాద్ చేరేం. గ్రీస్ నుండి ఇరాక్ వెళ్ళవద్దని, ప్రాణాపాయకరమని ప్రభుత్వం చేసిన హెచ్చరికలను పెడచెవిని పెట్టి ఒకసారి కాదు, పదిహేనుసార్లు ఇరాక్ వెళ్ళేం. మాకున్న ఆర్థిక వనరులతో, భక్తి విశ్వాసాలతో సత్యసాయి సంస్థల తరఫున ఆస్పత్రులకు వెళ్ళి మందులు అందించేం. అక్కడ చెయ్యగల సేవలు చేశాం. అక్కడి డాక్టర్లు మా ధైర్య సాహసాలను మెచ్చుకున్న కొలదీ మాలో ఉత్సాహం, స్వామిమీద విశ్వాసం పెరుగుతూ వచ్చేయి.

గోధుమ పిండి - మిల్క్ పౌడర్

ఒక అద్భుతమైన సంఘటన చెపుతాను. దీనిని నమ్మలేనివాళ్ళు దురదృష్టవంతులు. నమ్మినవాళ్ళ విశ్వాసం దృఢపడుతుందని ఈ సంఘటన గురించి చెపుతున్నాను. యుద్ధంలో బాగా దెబ్బతిన్న ప్రదేశం 'డార్ఫేర్'. అక్కడ జనం ఆకలితో అలమటిస్తున్నారని తెలిసింది. ముఖ్యంగా వాళ్ళకు కావలసినది గోధుమపిండి. దాన్ని మరికొంచెం ఎక్కువగా పట్టుకెళ్ళేవాళ్ళం. ఆ ప్రాంతంకంటే మరో మారుమూల ప్రాంతంలో తిండి దొరక్క మాడిపోతున్నారని తెలిసి నూరు టన్నుల గోధుమపిండి అక్కడికి ట్రక్కులలో తీసుకు వెళ్ళేం. అక్కడ భయానకమైన పరిస్థితి ఎదురైంది. నిత్యం అనేకమంది చిన్నపిల్లలు పాలపొడి లేక మరణిస్తున్నారని తెలుసుకున్నాం. "కొంచెం మిల్క్‌పౌడర్ ఏమైనా తెచ్చారా?" అని చాలామంది మమ్మల్ని అడిగేరు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా దొరికితే కొని పట్టుకొద్దా మనుకున్నాం. ఎక్కడా దొరకదన్నారు. "భగవాన్! పాలపొడి తేవాలన్న బుద్ధి మాకెందుకు కలుగలేదు? వీళ్ళకి మీరే దిక్కు" అని ప్రార్థించేం.

ట్రక్కుల్లోంచి మేము దింపుతున్న గోధుమపిండి సంచీలలో ఒక సంచీ చివర పగిలి పిండి బయటికి వస్తే, అక్కడ చేరిన పిల్లలు ఆవురావురుమని గుప్పిళ్ళతో దాన్ని తీసుకుని తినడం చూశాను.

"బాబుల్లారా! అది గోధుమపిండి. అది తింటే నోరంతా బంకలా అంటుకుని గొంతుకు దిగదు" అని హెచ్చరించాను. ఇంతలో ఒకతను ఆ పిండిని కొంత నోట్లో వేసుకుని రుచి చూసి, "ఇది పాలపొడి మేడం. అందుకే పిల్లలు తినగలుగుతున్నారు" అన్నాడు. నేను కొంచెం తీసి

నోట్లో వేసుకొని చూశాను. అవును, అది మిల్క్ పౌడరే! రెండు మూడు సంచీలు విప్పి చూశాం. అంతా మిల్క్ పౌడరే! ఇంక అక్కడ వాళ్ళ ఆనందానికి అంతులేదు. సాక్షాత్ సాయి భగవానుని లీల. నూరు టన్నుల గోధుమ పిండి నూరు టన్నుల అత్యంత విలువైన పాలపొడిగా మారిపోయింది.

మేము ఏ ఆహార పదార్థాలు తెచ్చినా ట్యాక్స్ కట్టాలి. ఆ ట్యాక్సు రసీదుని, 'ఫకూరా' అంటారు. మేము కట్టిన ట్యాక్సు 100 టన్నుల గోధుమపిండికి. తీరా ఇప్పుడు చూస్తే ఫకూరాలో నూరు టన్నుల మిల్క్ పౌడర్‌కని ఉంది. ఈ మహాద్భుత చర్యకు ఆనందబాష్పాలతో భగవాన్‌ని తల్చుకున్నాం.

మీరంతా ఎంతో అదృష్టవంతులు. ఇక్కడ నిత్యం మీరు భగవాన్ బాబావారి మహిమలను చూస్తూనే ఉన్నారు. దేశ విదేశాల్లో ఉండేవాళ్ళు వాళ్ళ సేవాకార్యక్రమాలలో భగవాన్ దివ్యహస్తం చూడగలుగుతున్నారు. అదే వాళ్ళ పాలిట అభయహస్తం" అంటూ శ్రీమతి హెలెన్ తన ప్రసంగాన్ని ముగించారు.

విశ్వరూప దర్శనం

భారతదేశం తరఫున విదేశీ రాయబారిగా పదవిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి పదవీ విరమణ చేసిన శ్రీ ఎమ్.కె. రసగోత్ర, ఐఎఫ్ఎస్., 40 సంవత్సరాల నుండి తన ఆరాధ్య దైవంగా కొలిచిన భగవాన్ బాబావారితో ఆయన అనుభవాన్ని ఆయన మాటల్లోనే విందాం:

లాస్ ఏంజెల్స్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నేను 1985 జూన్‌లో ఒక టెర్మినల్ నుండి మరో టెర్మినల్‌కి వెళ్ళవలసి ఉండగా, ఒక బస్సు బదులు పొరపాటున మరొక బస్సు ఎక్కేను. కొంతదూరం వెళ్ళేక నా తోటి ప్రయాణికులు ఎవరూ లేకపోవడం చూసి ఎంక్వయిరీ చేసి, నేను వెళ్ళవలసిన టెర్మినల్‌కి వెళ్ళే బస్సు అది కాదని తెలుసుకుని, తర్వాత స్టాప్‌లో దిగిపోయేను. ఆ కంగారులో బస్సు వెళ్ళిపోయేక నా చేతిలో ఉన్నది న్యూస్ పేపరనీ, హేండ్ బ్యాగు బస్సు సీటుమీద వదిలేసి దిగిపోయేనని
5 గమనించేను. ఆ హేండ్ బ్యాగులో నా పాస్‌పోర్టు, డబ్బు, క్రెడిట్ కార్డు, ఎడ్రస్‌లు, టెలిఫోన్ నెంబర్లు ఉన్న పుస్తకం ఉన్నాయి. నేనెక్కవలసిన బస్సు అయిదు నిమిషాల్లో వచ్చింది. ఈలోగా అటూ ఇటూ బస్సులు ఎయిర్ పోర్టులో తిరుగుతూనే ఉన్నాయి. బస్సు డ్రయివర్‌తో నా బ్యాగు మరచిపోయిన విషయం చెప్పి, దాన్ని ట్రేస్ చెయ్యడానికి ఏం చెయ్యాలో చెప్పి సహాయం చెయ్యమన్నాను. "ఈ టెర్మినల్స్ మధ్య 200 బస్సులు తిరుగుతున్నాయి. మీ ప్లేన్ వెళ్ళిపోయేలోగా ఎన్ని బస్సులు ఎంక్వైరీ చేయగలం?! ముందర బస్సు దిగండి. ఇంక మిమ్మల్ని ఆ దేవుడే రక్షించాలి" అన్నాడు బస్సు స్టార్ట్ చేసి వెళ్ళిపోతూ.

ఆ నిస్సహాయ స్థితిలో దిక్కుతోచక, ఆ బస్సు డ్రైవరన్నట్లు భగవంతుడే దిక్కనిపించి, నా ఇష్ట దైవమైన భగవాన్ బాబాను కన్నీళ్ళతో ప్రార్థించేను. రెండు నిమిషాల్లో నా ప్రక్కన ఒక తెల్లని కారు ఆగింది. మీసాలు, కళ్ళజోడు ఉన్న ఒక మెక్సికన్ డ్రైవర్ నాకేసి చూసి, "మీ హేండ్ బ్యాగు బస్సులో మరచిపోయేరు కదూ?! ఇదేనా?" అంటూ కారు డోరు తెరిచి, "ఎక్కండి, మీ టెర్మినల్‌లో దింపుతాను" అన్నాడు. కారెక్కి హేండ్ బ్యాగును కౌగలించుకుంటూ కళ్ళు మూసుకుని స్వామికి మౌనంగా కృతజ్ఞతాభివందనములు అర్పిస్తుండగా నా టెర్మినల్ వచ్చింది. కారు దిగి డ్రయివర్‌కి కృతజ్ఞతలు తెల్పుకుందామనేలోగా అతడు నాకేసి చూసి చిరునవ్వు నవ్వి వెంటనే వెళ్ళిపోయేడు. ఆ డ్రయివర్ ముఖం, అతని సంభాషణ స్వరంలో ఏదో పరిచయమున్న భావం కలిగి ఒక్క క్షణం ఆలోచించగానే స్ఫురించింది, ఆ మందహాసం, కళ్ళల్లో కరుణ, ఆ మధుర స్వరం – భగవాన్, సందేహం లేదు!

ఇండియా తిరిగొచ్చేక ప్రశాంతి నిలయం వెళ్ళాను. "చూశావా! నీ ప్రార్థన వినగానే లాస్‌ఏంజెల్స్ ఎయిర్ పోర్టులో నువ్వు అజాగ్రత్తగా వదిలేసిన నీ హేండ్ బ్యాగు తెచ్చి ఇచ్చేను" అని స్వామి నన్ను పలకరించగానే భక్తి పారవశ్యంతో పాదాభివందనం చేసి, "ఈ విశ్వంలో స్వామి లేని చోటు, క్షణం ఎక్కడుంటుంది స్వామీ!" అని కొనియాడేను త్రికరణశుద్ధిగా.

(సశేషం)

ఫిజీ:

ఫిజీలోని వెన్యువా లీవు ద్వీపంలో 2014 ఆగస్టు 17 – 22 తేదీల మధ్య సాయి సంస్థవారు ఒక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ఆస్ట్రేలియాకు చెందిన 53 మంది సత్యసాయి వలంటీర్లు, 8 మంది ఫిజీకి చెందినవారు పాల్గొన్నారు. ఇది ఆ ప్రాంతంలో ఏర్పాటైన తొలి వైద్య శిబిరం. సాధారణ వైద్యులు, చర్మవైద్యులు, దంతవైద్యులు, నేత్రవైద్యులు, మనస్తత్త్వవేత్తలు,

పేర్లు నమోదు చేయించుకుంటున్న పేషంట్లు

ఫిజియోథెరపిస్టులు ఈ బృందంలో ఉన్నారు. తొలి రోజున అనగా, ఆగస్టు 17వ తేదీన వీది లీవు ద్వీపంలోని ఒక మెడికల్ స్కూలులో వైద్యులు సమావేశమై లాబసా నగరానికి సమీపంలో ఉన్న రెండు గ్రామాలలో రెండేసి రోజుల చొప్పున వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. లాబసా సంగమ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు చెందిన 20 మంది స్టూడెంట్లు, మరో 20 మంది మెడికల్ స్టూడెంట్లు సత్యసాయి వలంటీర్లకు తమ సహాయ సహకారములందించారు. ఈ శిబిరంద్వారా మొత్తం 1,736 మంది పేషంట్లు లబ్ధి పొందారు. మండుటెండలో కాలినడకన 23 మైళ్ళ దూరం ప్రయాణించి ఈ మెడికల్ క్యాంపుకు వచ్చిన ఒక పేషంటును చూసి చలించిపోయిన ఒక వలంటీరు, “అవసరంలో ఉన్నవారికి ప్రేమ పూర్వకంగా శ్రద్ధతో సేవలందించడమనేది జీవితాంతం చేయవలసిన ఆధ్యాత్మిక సాధనగా గ్రహించాను” అన్నారు.

రష్యా:

2014 జులై 20 – 29 తేదీల నడుమ యూరల్ ప్రాంతంలో ఉన్న అరకేవో గ్రామంలో ‘హార్ట్ టు హార్ట్

ఆధ్యాత్మిక శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులు

డైలాగ్' అనే అంశంపై ఏర్పాటైన ఆధ్యాత్మిక శిబిరంలో 16 దేశాలకు చెందిన 37 మంది బాలలతో సహా మొత్తం 88 మంది ప్రతినిధులు పాల్గొని వారివారి సంస్కృతులలో అంతర్లీనంగా ఉన్న మానవతా విలువలనుగురించి చర్చించుకున్నారు. ప్రతి రోజు పిల్లలకు బాలవికాస్ తరగతులు నిర్వహింపబడినాయి. తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మానవతా విలువలలో విద్యాబోధనపై మూడు సెమినార్లు ఏర్పాటైనాయి. ఈ సందర్భంగా రష్యా, యుక్రైన్, బెలోరష్యా, బల్గేరియా, ఇండియా, బష్కీరియా, కజాఖస్థాన్‌లకు చెందిన ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

ఆర్జెంటైనా:

2005 సం॥ నుండి సత్యసాయి భక్తులు బోయెనస్ ఐరస్‌కు సమీపంలోని ఫ్లోరెన్సియో వరెలా అనే వెనుకబడిన ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేదలకి ప్రేమాస్పదమైన

బాలలకు సంగీతంలో శిక్షణా కార్యక్రమం

సేవలందిస్తున్నారు. 50 మంది బీద బాలలకు వారానికి మూడు పర్యాయములు ఆహారం వితరణ చేస్తున్నారు. బాలవికాస్ తరగతులు, ఆటల పోటీలు, సంగీత సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి పిల్లలలో మానసిక వికాసానికి దోహదం చేస్తున్నారు. మెడికల్ క్యాంపులద్వారా ప్రతి నెల దాదాపు 100 మందికి ప్రయోజనం కలిగిస్తున్నారు. ప్రతి ఆదివారం స్పెషల్ బ్రేక్‌ఫాస్టు వితరణ చేస్తున్నారు. ప్రారంభంలో ఆ బీదజనులు కేవలం ఆహారంకోసం వచ్చేవారు. ఇప్పుడు ప్రేమకోసం, శాంతికోసం వస్తున్నారు.

నేపాల్:

2014 సెప్టెంబరు 5,6 తేదీలలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సత్యసాయి ఎడ్యుకేషన్‌వారు (ISSE) నేపాల్ తూర్పు ప్రాంతంలో 300 మంది ప్రైవేట్ స్కూల్ టీచర్లకు మానవతా విలువలతోకూడిన విద్యాబోధనపై ఒక సదస్సు

సదస్సుకు హాజరైన అధ్యాపకులు

నిర్వహించారు. స్థానిక విద్యాశాఖాధికారి తన ప్రారంభోపన్యాసంలో సత్యసాయి సంస్థలు చేపట్టిన విలువలతోకూడిన విద్యాబోధన (SSEHV) కార్యక్రమాన్ని వేనోళ్ళ కొనియాడారు. ప్రస్తుత విద్యావిధానంలో మానవతా విలువలను మేళవించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంతవరకు ISSE వారు 10,690మంది ప్రైవేట్ స్కూల్ టీచర్లకు శిక్షణ అందించారు. 2,238 మంది తల్లిదండ్రుల ఉపయోగార్థం 'విలువలతో కూడిన పిల్లల పెంపకం' అన్న అంశంపై ప్రసంగాలు ఏర్పాటు చేశారు.

'ఫాదర్స్ డే'ను పురస్కరించుకొని 2014 ఆగస్టు 25వ తేదీన నేపాల్ సత్యసాయి సంస్థ ఐదు కారాగారాలలోని 1,809 మంది మగ ఖైదీలకు మధ్యాహ్న భోజనం వితరణ చేసింది. ఖాట్మండులో 645 మంది ఖైదీలకొరకు భజన

కార్యక్రమం నిర్వహించారు. అనంతరం, నిత్య జీవితంలో మానవతా విలువల ఆవశ్యకతను తెలియజేసే ప్రసంగం ఏర్పాటు చేశారు. భైరవాలోని శ్రీ సత్యసాయి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పెద్దలకు సాయి సంస్థవారు దుస్తులు వితరణ చేశారు.

'హరితలికా తీజ్' ఉత్సవం సందర్భంగా 2014 ఆగస్టు 26న మహిళా విభాగంవారు ఐదు కారాగారాలలో ఉన్న 492 మంది మహిళా ఖైదీలకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. గాజులు, పూసల దండలు, ఆభరణాలు పంపిణీ చేశారు. సాయి భక్తులు చూపించిన నిస్స్వార్థ ప్రేమకు ఖైదీలు ఎంతగానో ప్రభావితులైనారు.

గ్రీస్:

2014 జులై 27వ తేదీనుండి ఆగస్టు 5వ తేదీవరకు 'సాయి ప్రేమ' అన్న అంశంపై మూడవ ఆధ్యాత్మిక శిబిరం నిర్వహించారు. ఇటలీ, జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, స్లోవేనియా, ఫిన్లండ్, గ్రీస్ దేశాలకు చెందిన సత్యసాయి సంస్థల సభ్యులు 30 మంది ఇందులో పాల్గొని భజన, ధ్యానము, ప్రార్థన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. 'వర్క్, వర్షిప్, విజ్డమ్' (కర్మ ఉపాసన జ్ఞానము) అన్న అంశంపై స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో చివరి రోజున ప్రతినిధులందరూ ఉపవాస దీక్షతో మౌనవ్రతం పాటించటం విశేషం.

ఆత్మోత్తేజం కలిగించిన ఆధ్యాత్మిక శిబిరం

యుఎస్ఎ:

2014 సెప్టెంబరు 20వ తేదీన టాంపా బే, ఫ్లోరిడా సత్యసాయి కేంద్రంవారు ప్రభుత్వ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించి 105 మందికి సేవ లందించారు. వచ్చిన ప్రతి పేషంటుకు బ్లడ్ షుగర్ పరీక్ష జరిపి, ఆ తరువాత బ్రేక్‌ఫాస్ట్ అందజేశారు. నేత్ర పరీక్షల అనంతరం రీడింగ్ గ్లాసెస్ అవసరమైనవారికి వెంటనే అందజేశారు. డాక్టర్లు కంటి అద్దాలు సూచించినవారికి రెండు వారాల తరువాత వాటిని అందించే ఏర్పాటు చేశారు. పరీక్ష చేయించుకొని క్యాంపునుండి నిష్క్రమించే సమయంలో ప్రతి పేషంటుకీ ఒక లంచ్ బాక్స్ అందజేశారు. ఈ సేవాకార్యక్రమంపట్ల ఒక పేషంటు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "నేనిక్కడికి రావటానికి గల కారణాలలో ఒకటి నాకు విజన్ ఇన్సూరెన్సు లేకపోవటం. అయితే, ఇన్సూరెన్సు ఉన్నా లభించనంత మెరుగైన వైద్యసేవలు నేనిక్కడ పొందగలిగాను" అన్నారు. అతని అభిప్రాయంతో ఏకీభవిస్తూ మరో పేషంటు, "ఆర్థికంగా వెనుకబడిన మావంటివారికోసం తమ అమూల్యమైన సమయం వెచ్చించి సేవలందించినవారందరికీ నా కృతజ్ఞతలు. నిజంగా ఈ వైద్యశిబిరం ప్రేమ పరిమళాలను వెదజల్లుతోంది" అన్నారు.

రీడింగ్ గ్లాసెస్ అందజేస్తున్న వలంటీర్లు

– శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్

సాయి వైద్య సంగమం

ప్రశాంతి గ్రామ్‌లోనూ, వైట్‌ఫీల్డులోనూ ఉన్న శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్‌ల పూర్వ విద్యార్థినీ విద్యార్థుల ప్రప్రథమ సమ్మేళనం శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్, ప్రశాంతి గ్రామ్‌లో 2014 డిసెంబరు 20వ తేదీన నిర్వహించారు. ఈ సమ్మేళనంలో భారతదేశములోని వివిధ ప్రాంతాలనుండి, ఇంకా విదేశాలనుండికూడా వచ్చిన మొత్తము 300 మంది పాల్గొన్నారు. వీరందరూ వైద్యరంగములో వివిధ విభాగాలలో నైపుణ్యమును సాధించినవారు.

ఈ సందర్భములో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ శ్రీ కె. చక్రవర్తి ఆహూతుల నుద్దేశించి మాట్లాడుతూ, "సంవత్సరంలోని 52 వారాలలో కనీసం ఒక వారాన్ని శ్రీ సత్యసాయి వైద్యాలయాలలో పనిచేయటానికి కేటాయిస్తే మీకు మాతృసంస్థతో అనుబంధము గాఢమవటమేగాక అనుభవజ్ఞులైన మీ సేవలవలన ఈ వైద్యాలయాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది" అన్నారు. అంతేకాక, "మీరు ఈ వైద్యాలయాలలో గడిపే ఆ ఒక్క వారమూ మీలో సేవాస్ఫూర్తిని, ఉత్సాహాన్ని కలిగించి మీరు పనిచేసే చోట వైద్యవృత్తిని అంకిత భావముతో కొనసాగించటానికి తోడ్పడుతుంది" అన్నారు.

అంతకుముందు శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్, ప్రశాంతి గ్రామ్ డైరెక్టర్ డా॥ ఓలేటి చౌదరి తమ స్వాగతోపన్యాసములో భగవాన్ బాబావారి దివ్యతత్త్వము అత్యంత సరళము అన్నారు. "సర్వులనూ ప్రేమించు, సర్వులనూ సేవించు. ఇతరులకు సహాయాన్ని అందించటానికి సదా సంసిద్ధముగా ఉండు. ఎన్నడూ ఎవరినీ నొప్పించకు – ఇదే స్వామి సందేశము" అన్నారు. సేవాదృక్పథమనే మౌలిక సూత్రముపైన ఆధారపడిన విద్య వైద్య రంగాలు ఈ రోజులలో అత్యంత లాభసాటి అయిన వ్యాపార రంగాలుగా మారాయి అన్నారు. అందువలన ఈ వైద్యాలయాలలో స్వామి మనకు బోధించిన విలువలను మనం మన వృత్తిలో ప్రవేశపెట్టాలి అన్నారు.

శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్, వైట్‌ఫీల్డు డైరెక్టరు డా॥ స్వర్ణ భరద్వాజ్ ఆహూతులకు మార్గ నిర్దేశక సూత్రాలను వివరించారు.

పూర్వ విద్యార్థినీ విద్యార్థుల సంఘము కార్య నిర్వాహకులను ఏకగ్రీవముగా ఎన్నుకోవటముతో ఈ సమావేశం ముగిసినది.

క్రిస్మస్ వేడుకలు

ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలను డిసెంబరు 24వ తేదీన సాయంవేళలో సాయికుల్వంత్ హాలులో ఇంటర్నేషనల్ క్రిస్మస్ కమిటీ కోఆర్డినేటర్ జాన్ బెనర్ (అమెరికా), ఇంటర్నేషనల్ క్రిస్మస్ డెకరేషన్స్ కమిటీ డైరెక్టర్ టాం లెహాయ్‌తో కలసి మహాసమాధివద్ద క్రొవ్వొత్తి వెలిగించి ప్రారంభించారు.

అనంతరం ప్రఖ్యాత సంగీత కళాకారిణి గిసెల్ల సెబాస్టియన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ క్రిస్మస్ క్వయర్‌లో 24 దేశాలనుండి వచ్చిన 430 మంది భక్తులు పాల్గొన్నారు. వీరిలో కొందరు గాత్ర సంగీతములో నిష్ణాతులు కాగా మరికొందరు వాయిద్య సంగీతములో ప్రవీణులు. వీరు "వక్రతుండ మహాకాయ..." అన్న గణేశ ప్రార్థనతో ప్రారంభించి 'బి స్టిల్ ఫర్ ది ప్రెజెన్స్ ఆఫ్ ది లార్డ్', 'ది మెసేజ్ ఆఫ్ లవ్ గోస్ ఆన్', 'ఓపెన్ ది ఐస్ ఆఫ్ మై హార్ట్', 'సొ దిస్ ఈజ్ క్రిస్మస్', 'జాయ్ టు ది వరల్డ్' గీతాలద్వారా క్రిస్మస్ ప్రాముఖ్యాన్ని భక్తులకు తెలియజేశారు.

డిసెంబరు 25వ తేదీన బ్రహ్మముహూర్తంలో ప్రశాంతి నిలయంలో నిత్యమూ జరిగే ఓంకారము, సుప్రభాతముల తరువాత ఉదయం గం 6.30 లకు క్రిస్మస్ ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కెనడా యువతీ యువకులు దైవపితృత్వ భావనను ప్రతిబింబించే గీతాలను గానం చేశారు. ఈ బృందంలో ఓంటారియోలో ఆదర్శ పాఠశాలగా పేరొందిన శ్రీ సత్యసాయి స్కూలు బాలలు కూడా ఉండటం విశేషం.

ఈ కార్యక్రమానంతరం శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూలు బాలల వయొలిన్ వాదనను, శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ మ్యూజిక్ బ్యాండు వాదనను భక్తులు విన్నారు.

అనంతరం విద్యార్థులు జీసస్ పవిత్ర జీవిత గాథను ప్రార్థనా గీతాలతో, వ్యాఖ్యానాలతో చిత్రీకరించారు. వీరు 'జింగిల్ బెల్స్ జింగిల్ బెల్స్ జింగిల్ ఆల్ ది వే' వినిపించేటప్పుడు శాంటాక్లాజ్ చాక్లెట్స్‌ను విసిరి జీసస్ జననంతో మానవాళిలో వెల్లివిరిసిన ఆనందాన్ని చాటారు.

ఆరోజు సాయంవేళలో 49మంది అంతర్జాతీయ సాయి బాలలు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. వీరు భారతీయ సంప్రదాయాన్ననుసరిస్తూ వేదప్రవచనంతో క్రిస్మస్ క్వయర్‌ను ప్రారంభించారు. బెత్లహేంలో జీసస్ ఆవిర్భావాన్ని వర్ణించారు. ఈ క్వయర్‌కు జర్మనీకి చెందిన సంగీత విద్వాంసురాలు గెసిన్ స్ట్రోమియర్ నాయకత్వం వహించారు. ఈసందర్భములో, గతములో అంతర్జాతీయ బాలలకు సంగీతములో శిక్షణ ఇచ్చి, వారి కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించిన నెదర్లాండ్స్‌కు చెందిన సంగీత విద్వాంసురాలు ఆల్మా బాడింగ్స్‌ను అంతర్జాతీయ క్రిస్మస్ కమిటీ సత్కరించింది.

తదుపరి శ్రీమతి జాయిస్ డార్లెన్ బార్కర్ (కెనడా), శ్రీ నెవెల్లీ ఫ్రెడ్రిక్స్ (ఆస్ట్రేలియా) ప్రసంగించారు. శ్రీమతి జాయిస్ భగవాన్ బాబావారిగురించి తొమ్మిది పుస్తకాలు వ్రాశారు. వీరు బాల్యంలో తాను చిత్తశుద్ధితో జీసస్‌ను అనుసరించానని, ఆ సాధన తనను భగవాన్ బాబావారి వైపు నడిపించిందన్నారు. దివ్యత్వముతో సంభరితమైన ఐకమత్యమే క్రిస్మస్ సందేశమన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మశోధనతో సాధనా పథంలో ముందుకు సాగాలన్నారు. "బాబా నా ఊపిరి, హేతువు, నా ఆనందానికి ఆధారం" అన్నారు.

శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ జోన్ 3 ఛైర్మన్ శ్రీ నెవిల్లీ ఫ్రెడ్రిక్స్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం భగవాన్ బాబావారిని వైట్‌ఫీల్డులో తాను తొలిసారి కలిసినప్పుడు తనలో అంతవరకు నెలకొని ఉన్న తర్కం, హేతువుల స్థానాలను భక్తి విశ్వాసములు ఆక్రమించా యన్నారు. ఈ పరిణామాన్ని మేధోశక్తితో చేసే శోధన నుండి ఆత్మశక్తితో చేసే సాధనగా రూపాంతరం చెందిన విశిష్ట ప్రక్రియగా, పరివర్తనగా పేర్కొన్నారు.

వీరి ప్రసంగానంతరం భగవాన్ బాబావారి క్రిస్మస్ సందేశాన్ని ప్రసారం చేశారు. స్వామి తమ ప్రసంగంలో జీసస్ జననాన్ని ప్రస్తావిస్తూ పుష్పముయొక్క పరిమళము అందరినీ ఆకర్షించినట్లుగా జీసస్ అందరినీ ఆకర్షించారు అన్నారు. జీసస్ సామాన్య బాలురవలెకాక విలక్షణమైన గుణములతో దైవభావనతో ఉండేవారన్నారు. సర్వ జీవులయందున్నవాడు సర్వేశ్వరుడొక్కడే. కనుక, ఎవరిని బాధించినా భగవంతునికే ఆ బాధ సోకుతుంది, అన్నారు. తమ ప్రసంగాన్ని ముగిస్తూ, 'లవ్ ఈజ్ మై ఫామ్ ట్రుత్ ఈజ్ మై బ్రెత్...' పాట పాడారు.

డిసెంబరు 26వ తేదీన సాయం వేళలో ఇంటర్నేషనల్ క్రిస్మస్ కమిటీ ఛైర్మన్ జాన్ బెనర్ తమ ప్రసంగంలో శ్రీ లైంగ్ రాన్ అనుభవాన్ని ఉటంకించారు. ఆ దివ్యానుభవంతో శ్రీరాన్‌కి భగవాన్ బాబా 'కాస్మిక్ క్రైస్ట్' అన్న విశ్వాసం దృఢమయింది, అన్నారు.

కెనడా సాయిసంస్థల సభ్యులైన శ్రీ నాథన్ మాట్లాడుతూ ఓంటారియో సాయిసంస్థ నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి స్కూలు ఏవిధముగా ఆదర్శవంతమైన పాఠశాలగా గణుతికెక్కిందో తెలియజేశారు.

వీరి ప్రసంగానంతరం ఓంటారియో సత్యసాయి స్కూలు బాలలు 'దివ్య సమర్పణలు' అన్న ఇతివృత్తముపై ఒక నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో ఒక్కొక్క మత విశ్వాసానికి చెందినవారు భగవంతునికి సమర్పించవలసిన ఒక్కొక్క ఉత్తమ గుణాన్ని సూచిస్తారు.

కెనడాలో ఆధునిక ప్రపంచానికి దూరంగా ప్రకృతి ఒడిలో జీవనాన్ని సాగిస్తున్న స్వతఃసిద్ధంగా కెనడా జాతీయులైనవారి నాయకుని అభిప్రాయంతో నాటిక ప్రారంభమవుతుంది. అతను అహింసను ఉత్తమ సమర్పణగా పేర్కొంటాడు. ఒక జోరాస్ట్రియన్ పెద్ద శాంతిని, మహమ్మదీయులు ఇంద్రియ నిగ్రహాన్ని, బౌద్ధులు ధ్యానాన్ని, హిందువులు త్రికరణశుద్ధిని, చివరగా క్రిస్టియన్ పెద్ద దయను ఉత్తమ సమర్పణగా పేర్కొంటారు. ఈ సద్గుణాలే భగవంతుడు మననుండి ఆశించేది అని ఈ నాటిక సందేశం.

డిసెంబరు 27వ తేదీన సాయంకాలం కెనడా సాయి భక్తులు - పురుషులు, మహిళలు, బాలలు - మానవతా విలువలు ముద్రించిన పత్రాలు ధరించి నేపథ్యంలో వ్యాఖ్యానం వినిపిస్తూ ఉండగా సౌత్ ఇండియన్ క్యాంటీను రోడ్డుమీదుగా సాయి కుల్వంత్ హాలువరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 'వాక్ ఆఫ్ వేల్యూస్' (విలువలతో కూడిన నడక) అనే ఈ కార్యక్రమాన్ని కెనడా సాయి భక్తులు మానవతా విలువలపట్ల మానవాళిలో అవగాహన పెంపొందించటానికి 2003లో ప్రారంభించారు. ర్యాలీ అనంతరం వివిధ మతములపట్ల సమభావాన్ని ప్రకటిస్తూ ప్రార్థనలు చేశారు. చివరగా కెనడా సాయి యువత భక్తి గీతాలను గానం చేశారు.

డిసెంబరు 28వ తేదీన సాయంత్రం శ్రీమతి సాయి స్వరూపా అయ్యర్ కర్ణాటక బాణీలో సంకీర్తన చేశారు. 'చిత్రావతీ నది తీరాన...'తో ప్రారంభించి మాతృశ్రీ ఈశ్వరమ్మను కీర్తిస్తూ 'సాయీశ్వరునికి జన్మనిచ్చిన...' పాడారు. 'హే సాయి నీ దివ్యరూపము', 'సాకేత రామా శ్రీరామా', 'డోలలూగు సాయి' 'ఈశ్వరాంబ సుత సత్యస్వరూప జయ మంగళం నిత్య శుభ మంగళం' పాటలు వీరి సంకీర్తనలో చోటుచేసుకున్నాయి.

సంగీత విభావరి

శ్రీ సత్యసాయి మీర్పురి సంగీత కళాశాల పూర్వ విద్యార్థులు తొమ్మిదిమంది డిసెంబరు 30వ తేదీన సాయంకాలం సంకీర్తన చేశారు. 2015 నవంబరులో జరిగే భగవాన్ బాబావారి 90వ జన్మదిన వేడుకలను దృష్టిలో ఉంచుకొని వీరు 90 సాయికేంద్రాలలో సంగీత కచేరీలను నిర్వహించే సంకల్పంతో ఉన్నారు. డిసెంబరు 30వ తేదీన వీరు కర్ణాటక బాణీలో చేసిన కచేరీలో వారి జీవితాలను తమ స్వీయ దివ్య పర్యవేక్షణలో తీర్చిదిద్దిన భగవాన్ బాబావారికి కృతజ్ఞతాంజలి అర్పించారు. 14 సంవత్సరాల క్రితం భగవాన్ బాబావారి దివ్యాశీస్సులతో ప్రారంభమైన శ్రీ సత్యసాయి మీర్పురి సంగీత కళాశాల ఎందరో విద్యార్థులకు సంగీతంలో సుశిక్షణ ఇవ్వటమేగాక వారిలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగించి ఆదర్శవంతమైన కళాకారులుగా, పౌరులుగా తయారుకావటానికి విశేషంగా కృషి చేస్తున్నది.

సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూల్ మరియు శ్రీ సత్యసాయి హైయర్ సెకెండరీ స్కూల్ పూర్వ విద్యార్థినీ విద్యార్థులు 2014 డిసెంబరు 31వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలలో సాయి సందేశముల విశిష్టతను, వేదముల ప్రాముఖ్యాన్ని, నైతిక విలువలను పాటించవలసిన ఆవశ్యకతను తెలియజేశారు. గురు శిష్యుల మధ్య సంవాద రూపములో ఇంద్రియ నిగ్రహము, కృతజ్ఞత, నారాయణ సేవ, నిస్స్వార్థ సేవలను గురించి చర్చించారు. చివరగా రామాయణ గాథను వీడియో క్లిప్పింగుల సహాయంతో, భగవాన్ బాబావారి సందేశములతో, పాటలను మేళవించి ప్రదర్శించారు. గురుకుల విద్యాభ్యాస విధానములో భగవాన్ బాబావారి దివ్య పర్యవేక్షణలో, తమలో వ్యక్తిత్వ వికాసం కలిగిందనీ, భగవాన్ బాబావారి దివ్య మార్గదర్శకత్వములో శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూలు ఈ లక్ష్య సాధనకై కృషి చేస్తున్నదని చెప్పారు.

ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు ముందు గతములో ప్రైమరీ స్కూలుకు అధ్యాపకురాలిగా సేవలందించిన శ్రీమతి భారతి లక్ష్మి ప్రసంగిస్తూ, స్వామే సర్వస్వం అన్నారు. మంగళ హారతితో కార్యక్రమం సమాప్తమైనది.

- దివి చతుర్వేది

భక్తులు కోరవలసింది

హనుమంతుడు శ్రీరామచంద్రుని క్షేమవార్తను సీతామాతకు తెలిపి, లంకలో తన కార్యమును పూర్తి గావించుకొని తిరిగి శ్రీరామచంద్రునివద్దకు పోవుటకు ముందు సీతామాతవద్దకు వెళ్లి, "తల్లీ! నన్ను ఆశీర్వదించు" అని ప్రార్థించాడు.

సీతాదేవి "హనుమంతా! శాంతుడవు, బలవంతుడవు గుణవంతుడవు నీవు. అజరుడవై వర్ధిల్లు" అన్నది. హనుమంతునికి ఆనందం కలుగలేదు. అతనియొక్క అసంతృప్తిని గుర్తించిన సీత, "నాయనా! నీవు

అమృతుడవై జీవించు" అన్నది. ఇదికూడా అతనికి ఆనందం ఇవ్వలేదు. సీత హనుమంతుని ముఖము చూచి మరల, "హనుమా! నీ గుణగణములను ముల్లోకవాసులు కీర్తించెదరు గాక" అని దీవించినది. ఆ మాటలు విని హనుమంతుడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

హనుమంతుని మనస్సును అర్థము చేసుకున్న సీతామాత చివరకు, "రాముడు నిన్ను నిరంతరం ప్రేమించుగాక" అని ఆశీర్వదించింది. ఆ మాటలు విన్నంతనే హనుమంతుడు ఆనందంతో గంతులు వేశాడు. తాను కోరినది అదే. దైవప్రేమకు నోచుకోని జీవితము నిరర్థకమని హనుమంతుడు విశ్వసించాడు.

- బాబా

చిత్రరచన: భావరాజు వెంకట సత్యమూర్తి



లింగోద్భవకరా! సాయీశ్వరా!

REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64 REGN.NO. HDP/001/2015-2017
Licenced to post without prepayment No. HDP/001/2012-2014

Date of Publication 23rd January

ఇంటర్నేషనల్ క్రిస్మస్ క్వయర్

ప్రైమరీ స్కూలు బాలల వయొలిన్ వాదన

కెనడా భక్తుల క్రిస్మస్ కార్యక్రమం

ప్రేమ శక్తి అద్వితీయం

భగవంతునియెడల ప్రేమయే భక్తి. భగవంతుని ప్రేమించే వానికి సర్వత్రా భగవంతుడే కనిపిస్తూ ఉంటాడు. ఇట్టి పవిత్రమైన ప్రేమను మానవులయందు చాటే నిమిత్తమై దైవము మానవ రూపంలో అవతరిస్తాడు. పూర్వకాలమందు మహర్షులు క్రూరమృగములు సంచరించే కారడవులలో నిర్భయంగా తపస్సులాచరిస్తూ వచ్చేరు. వారివద్ద ఎటువంటి ఆయుధములూ ఉండేవి కావు. వారి రక్షణ వారి ప్రేమయందే ఇమిడి ఉండేది. వారు తమ ప్రేమను కేవలం మానవులకు పరిమితం చేయకుండా విశాలమైన హృదయాలతో క్రూరమృగములకు సహితం పంచిపెట్టడం ద్వారా శాంతియుత వాతావరణం నెలకొల్పగల్గేవారు. ఈనాడు మానవులు ఇట్టి దివ్యశక్తి గల ప్రేమను కోల్పోయేరు. స్వార్థము, స్వప్రయోజనము అనే దుష్టశక్తులు మానవులందు ప్రబలుతూ ఉండటంవలన క్రూరమృగముల లక్షణాలు ఉద్భవిస్తున్నాయి. మానవులలో ఉన్న మృగత్వాన్ని, పశుత్వాన్ని నిర్మూలం చెయ్యటానికి అత్యంత ప్రబలమైన ఆయుధం నిస్స్వార్థ నిర్మల ప్రేమయే.

– బాబా

వార్షిక చందా: ₹ 60 (భారతదేశంలో) ₹ 550, లేక $ 13 లేక £ 9 (విదేశాలకు)
చందా రుసుము ఒకటి లేక, రెండు, లేక మూడు సంవత్సరములకు స్వీకరించబడును.

సనాతన సారథి చందాలు మనీయార్డరుద్వారా, లేక పర్సనల్ చెక్‌ద్వారా, లేక డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా లేక, ఆన్‌లైన్ పద్ధతిన మా వెబ్‌సైటు **www.sanathanasarathi.org** ద్వారా చెల్లించవచ్చును. చందాలు పంపవలసిన చిరునామా: కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం – **515134**, ఆంధ్రప్రదేశ్.

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Anantapur district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : B.V. Ramana Rao